

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 2 సంచిక : 83 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : నరసరావుపేట | బుధవారం 25 నవంబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :83 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : NARASARAO PETA | WED 25 NOVEMBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావం..
ఏపీలో నేడు కూడా వర్షాలు

- ఏపీలో రానున్న నాలుగు రోజులు వర్షాలు
- పిడుగులు పడే అవకాశం ఉండటంతో అధికారుల హెచ్చరిక
- నేడు పలు జిల్లాల్లో మోస్తరు వర్ష సూచన
- ఉరుముల సమయంలో చెట్ల కింద ఉండవద్దని సూచన

- మిగతా 2లో



వావ్ నీ సంకల్పానికి ఆ విధి సైతం చప్పట్లు కొట్టాల్సిందే

పెన్ పవర్ డెస్క్: ఏపీ మంత్రి నారా లోకేశ్ ఓ ఆసక్తికర వీడియోను పోస్టు చేశారు. ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు దర్పణంలా నిలిచే ఓ దివ్యాంగుడి ప్రతిభను ప్రశంసించారు. దివ్యాంగుడైన మనోహర్ డ్యాన్స్ వీడియోని సామాజిక మాధ్యమాల్లో చూసిన మంత్రి లోకేశ్.. అతడి గురించి వివరాలను ఆరా తీసి ప్రతిభను ప్రశంసిస్తూ 'ఎక్స్'లో వీడియోని పోస్టు పెట్టారు. "నీ సంకల్పానికి ఆ విధి సైతం

- మిగతా 2లో





పసిఫిక్‌లో పెను ముప్పు..
10 డిగ్రీలు పెరిగిన వేడి!

మెగా ఎల్‌నినోతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదం

- గాలాపగోస్ దీవుల వద్ద అసాధారణంగా పెరిగిన సముద్రపు వేడి
- కొన్నిప్రాంతాల్లో 10 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతల నమోదు
- తీవ్రరూపం దాల్చుతున్న ఎల్ నినో ప్రభావమే కారణమని వెల్లడి
- దీన్ని 'మెగా ఎల్ నినో'గా అభివర్ణించిన అమెరికా వాతావరణ నిపుణులు
- గత రికార్డులను బద్దలు కొట్టవచ్చని హెచ్చరించిన నోవా, డబ్ల్యూఎంవో

- మిగతా 2లో

ఏపీలో వేర్వేరు ప్రమాదాల్లో
8 మంది మృతి..
సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



- విజయనగరం, విశాఖ, పల్నాడు జిల్లాల్లో జరిగిన ఘటనలు
- మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు సంతాపం
- ప్రమాద కారణాలపై విశ్లేషణ చేసి, చర్యలు తీసుకోవాలని ఆదేశం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచన

పెన్ పవర్ డెస్క్: ఏపీలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 8 మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉదయం విజయనగరం, విశాఖపట్నం, పల్నాడు జిల్లాల్లో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఓ వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో నలుగురు అక్కడికక్కడే మరణించారు. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడమే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణంగా అధికారులు సీఎంకు వివరించారు. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద జరిగిన మరో ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగి డ్రైవర్, క్లీనర్ సజీవ దహనమయ్యారు. ఇక, పల్నాడు జిల్లా క్రోసూరు మండలంలో అమరావతిలో దర్శనం ముగించుకుని తిరిగి వస్తున్న అయ్యప్ప భక్తుల కారు, డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు భక్తులు ప్రాణాలు కోల్పోగా, మరొకరు గాయపడ్డారు.ఈ మూడు ఘటనలపై సమగ్ర సమీక్ష జరపాలని పోలీస్, రవాణా శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ప్రమాదాల కట్టడికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశించారు.

మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం
గాలింపు ముమ్మరం చేయాలి

అమరావతి: సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. గాలింపు చర్యలపై అధికారులతో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బోటును గుర్తించేందుకు మరింత విస్తృతంగా గాలింపు చేపట్టాలని ఆదేశించారు. కాకినాడ జిల్లా ఉప్పాడకు చెందిన ఏడుగురు మత్స్యకారులు నవంబర్ 4న మోటరైజ్డ్ ఫిషింగ్ బోటులో వేటకు వెళ్లారు. పారాదీప్ పోర్టు సమీపానికి చేరుకున్నాక వారి నుంచి సమాచారం నిలిచిపోయింది. ఈ నెల 19 నుంచి బోటుతో సంబంధాలు తెగిపోయాయి. మొబైల్ ఫోన్లు, బోటులోని ట్రాన్స్‌పాండర్ స్విచ్

- మిగతా 2లో

1,008 కిలోల నెయ్యి, 1503 మీటర్ల వత్తి..
కనువిందు చేసిన కార్తిక మహాదీపం



పెన్ పవర్ డెస్క్: కార్తిక పౌర్ణమి పర్వదినాన యోగుల పర్వతం కైలాసాన్ని తలపించింది. చీకట్లను చీలుస్తూ ఎగసిన మహాదీపం వెలుగులు భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక పారవశ్యాన్ని నింపాయి. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక ఉన్న ఈ పవిత్ర గిరిపై మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మహాదీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఏక వీర సేవా

- మిగతా 2లో



హిజాబ్ లేకుండా పాట..
గాయనికి 74 కొరడా దెబ్బలు!

ఇరాన్‌లో గాయని పరస్తూ అహ్మదీపై శిక్ష అమలు

ఇరాన్‌లో మహిళల అణచివేత మరోసారి చర్చనీయాంశంగా మారింది. హిజాబ్ ధరించకుండా పాట పాడిన గాయనికి అక్కడి అధికారులు 74 కొరడా దెబ్బల శిక్ష అమలు చేశారు.

- మిగతా 2లో

కాశీ తరహాలో రాజమహేంద్రవరాన్ని
అభివృద్ధి చేస్తాం
భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



పెన్ పవర్ డెస్క్: ఆధ్యాత్మిక రాజధానిగా ఉన్న రాజమహేంద్రవరం నగరాన్ని కాశీ తరహాలో అభివృద్ధి చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. నగరానికి బంగారు భవిష్యత్తు ఇస్తామన్నారు. చారిత్రక, వారసత్వ నగరం సమగ్ర అభివృద్ధి కోసం మంచి ప్రణాళిక

- మిగతా 2లో



రష్యాకు యుద్ధ దెబ్బ..
4.9 లక్షల మంది మృతి?

లీకైన ప్రభుత్వ రికార్డుల విశ్లేషణలో వెలుగులోకి వచ్చిన ప్రాణనష్టం అంచనాలు

పెన్ పవర్ డెస్క్: ఉక్రెయిన్‌పై ఐదేళ్ల క్రితం రష్యా మొదలుపెట్టిన యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. 2022లో దురాక్రమణ ప్రారంభించినప్పటి నుంచి కనీసం 4.9లక్షల మంది రష్యా సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. వీరిలో కొన్ని వేల మంది 18 ఏళ్ల వయసువారే ఉండటం కలవరపెట్టే విషయం. మరోవైపు, ఐదేళ్ల కాలంలో

- మిగతా 2లో

సెప్టిక్ ట్యాంక్‌లో మృత్యుపాశం..
ముగ్గురు బలి!

విషవాయువులు పీల్చి ప్రాణాలు కోల్పోయిన శ్రీకాకుళం యువకులు

- బాచుపల్లి దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్‌లో ఘటన
- సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేస్తూ ముగ్గురు కార్మికులు మృతి
- విషవాయువులు పీల్చి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయిన వైనం
- మృతులు శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారిగా గుర్తింపు
- మృతదేహాలను బయటకు తీసిన హైడ్రా, ఫైర్ సిబ్బంది

- మిగతా 2లో



బాబాయ్‌ను దొంగ అన్నాడని..
క్లాస్‌మేట్ చెంప పగలగొట్టా!
చిన్ననాటి ఘటనను గుర్తు చేసుకున్న ప్రియాంకా గాంధీ



పెన్ పవర్ డెస్క్: కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా తమ పాఠశాల రోజుల నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. 1977 నాటి ఎమర్జెన్సీ అనంతరం తమ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులు, ఆ సమయంలో పాఠశాలలో ఎదురైన అనుభవాలను వారు తాజా వీడియో సంభాషణలో గుర్తు చేసుకున్నారు. తమ తల్లి, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ

- మిగతా 2లో

ఆస్తులు తీసుకుని..
వదిలేస్తే జైలుకే!
తల్లిదండ్రులను పట్టించుకోని సంతానానికి మూడేళ్ల శిక్ష.. కేరళలో కొత్త చట్టం



- మిగతా 2లో


ఎడిటర్ వ్యూ
EDITORIAL

"సేన" సైకిల్ కు దూరమవుతుందా?

స్థానిక సంస్థల ఎన్నికలు దాదాపుగా ముగిశాయి. పంచాయతీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కూటమి పార్టీల మధ్య ఉండదు. అయితే కూటమిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఒకరకంగా చిచ్చుపెట్టాయనే చెప్పాలి. ప్రధానంగా మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతల్లో అసంతృప్తి అయితే క్రమంగా బయటపడుతుంది. జనసేనలో పై స్థాయి నేతలు చంద్రబాబుకు అనుకూలంగా ఉన్నప్పటికీ కింది స్థాయిలో మాత్రం నేతలు పార్టీ నిర్ణయం పట్ల ఒకింత అసంతృప్తితోనే ఉన్నారు.సీట్ల సర్దుబాటు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని ఛైర్మన్లు, వైస్ ఛైర్లన్లు చేయడం కూడా జనసేన ద్వితీయ శ్రేణి నేతలకు మింగుడుపడటం లేదు. అధికారంలో ఉన్నారు కాబట్టి జనసేన కింది స్థాయి నేతలు ఇప్పుడు బయట పడటం లేదు. కానీ రానున్న కాలంలో జనసేనను నమ్ముకుంటే తమకు పదవులు రావన్న విషయం అర్థమయి వారు పార్టీకి దూరమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా తమ అసంతృప్తిని బయటపెడుతున్నారు.

క్యాడర్ మాత్రం...

పవన్ కల్యాణ్ , జనసేన మంత్రుల విషయంలో సాఫ్ట్ కార్నర్ గా ఉంటే సరిపోదు. కింది స్థాయిలో నేతలు మాత్రం తాము అన్యాయానికి గురవుతున్నారన్న భావనలో ఉన్నారు. ప్రధానంగా జనసేన, టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం ఉన్న చోట కూడా జనసేన క్యాడర్ కు న్యాయం జరగడం లేదు. జనసేన కార్యకర్తలను దూరం పెడుతూ వస్తున్నారని, జనసేన టీడీపీ మధ్య గ్రౌండ్ లెవెల్లో చీలికలు స్టార్ట్ అయ్యాయని లీడర్లే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని చోట్ల డైరెక్ట్ తిరుగుబాట్లు మొదలయ్యాయి. పంచాయతీ ఎన్నికల నాటికి ఇవి పీక్స్ లోకి చేరాయి. ఏ స్థాయికి వచ్చాయి అంటే ఆఖరి దశలో ఏకంగా జనసేన పార్టీ ఆఫీసియల్ గా స్వేచ్ఛగా పోటీ చేసుకోండి అని లెటర్ విడుదల చేసింది. కానీ అప్పటికే డ్యామేజ్ అయిపోయింది. లాస్ట్ మూమెంట్ లో ఆర్డర్ వచ్చినా టీడీపీ వాళ్ళు కనీసం నామినేషన్ కూడా వెయ్యనివ్వడం పోవడం చర్చనీయాంశమైంది.

చివరకు పిఠాపురంలోనూ...

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం వైస్ ఛైర్మన్ ఎన్నిక లో కూడా గందరగోళం నెలకొంది. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అనుచరుడు చక్రిపై జనసేన నేతలు దాడి చేశారు.పిఠాపురం వైస్ ఛైర్మన్ పదవి కోసం కౌన్సిలర్లు బొజ్జ వెంకటేశ్వరరావు, పిండి సంధ్యాల మధ్య పోటీ నెలకొంది. వైసీపీ నుంచి వచ్చిన బొజ్జ శ్రీనివాస్ పేరును ఖరారు చేయడంతో స్థానిక జనసేన నేతలు మండిపడుతున్నారు. స్థానిక నాయకత్వం పవన్ కల్యాణ్ ను తప్పుదోవపట్టించి వైసీపీ, టీడీపీ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పార్టీ విప్‌ను ధిక్కరించవద్దంటూ కౌన్సిలర్లతో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మంతనాలు జరిపారు. ఏకగ్రీవంగా వైస్ ఛైర్మన్ బొజ్జ వెంకటేశ్వరరావు ఎన్నిక పూర్తయింది.ఈ నేపద్యంలో జనసేన మళ్ళీ టీడీపీకి 2024 స్థాయి మద్దతు ఇవ్వడానికి క్యాడర్ సిద్ధంగా లేదని చెబుతున్నారు. బీజేపీ జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అసంతృప్తిని ప్రకటించగా, తాజాగా విశాఖ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కూడా డిప్యూటీ మేయర్ తమకు ఇవ్వకపోవడాన్ని తప్పుపట్టారు.

వావ్ నీ సంకల్పానికి ఆ విధి సైతం చప్పట్లు కొట్టాల్సిందే

- మొదటి పేజి తరువాయి

చప్పట్లు కొట్టి అభినందించాల్సిందే మనోహర్. నీ ఆత్మవిశ్వాసం ఓ అద్భుతం. సోషల్ మీడియాలో నీ డాన్స్ వీడియో చూసి వివరాలు తెలుసుకున్నాను. నాటు నాటు పాటకు డ్యాన్సే కాదు.. మనోహర్ షాట్ పుట్ అథ్లెట్, పాటలు కూడా పాడతాడట. ఆర్డీటీలో మనోహర్ లాంటి వందలాది దివ్యాంగులకు నైతిక విలువలతో కూడిన విద్య, క్రీడలు, జీవన నైపుణ్యాలు నేర్పిస్తున్నారని తెలిసి సంతోషించాను. ఆకాశమే హద్దుగా ప్రయత్నిస్తున్న మీరు బాలబాలికల భవిష్యత్తుకు వెలుగు దీపికలు. నిండైన ఆత్మవిశ్వాసపు ప్రతీకలు.. మీ ప్రతిభ అనన్య సామాన్యం. మీ అందరికీ అభినందనలు, ఆశీస్సులు" అని పేర్కొన్నారు.

మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేయాలి

- మొదటి పేజి తరువాయి

ఆఫ్ కావడంతో జీపీఎస్ ద్వారా కూడా ఆచూకీ లభించలేదు. కాకినాడ, చెన్నై, ఒడిశా కోస్ట్‌గార్డ్ అధికారుల సమన్వయంతో గాలింపు కొనసాగుతోంది. భారత కోస్ట్‌గార్డ్ నౌకలు, హెలికాప్టర్లతో పారాదీప్ తీరంలో గాలిస్తున్నారు. మత్స్యకారుల కుటుంబాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ.. గాలింపు పురోగతిని వారికి తెలియజేయాలని చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు.

కాశీ తరహాలో రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేస్తాం

- మొదటి పేజి తరువాయి

రూపొందించామని రానున్న రోజుల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. నగర అభివృద్ధిపై రూపొందించిన ప్రత్యేక మేనిఫెస్టోను రాజమహేంద్రవరంలో విడుదల చేశారు. తెదేపా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, భాజపా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన, బీజేపీ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం శివారు ప్రాంతాలన్నింటికీ తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ట్రాపిక్ సమస్య నివారణకు రోడ్ల అభివృద్ధి సహా రూ.89 కోట్లతో హ్యావలాక్ బ్రిడ్జిని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. దేవాలయాల అభివృద్ధికి ఇప్పటికే రూ.100 కోట్లతో ప్రసాదం స్కీమ్ కింద నిధులు తెచ్చినట్లు తెలిపారు. వైకాపాకి ఓటు వేస్తే.. దుర్వినియోగం అయినట్లేనని వ్యాఖ్యానించారు. గోదావరిని స్వచ్ఛ గోదావరిగా మార్చడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రాజెక్టు తీసుకువస్తామన్నారు. గతంలో వైకాపా విధ్వంసకర పాలన అందించిందని, కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి వైపు రాజమహేంద్రవరం అడుగులు వేస్తోందని నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావం.. ఏపీలో నేడు కూడా వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) వెల్లడించింది. వర్షాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఏపీలో ఇవాళ పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులో రోడ్లపై మోకాలి లోతున నీరు నిలిచింది. నెల్లూరులోనూ వర్షపాతం నమోదైంది.వాతావరణ శాఖ వివరాల ప్రకారం, నైరుతి బంగాళాఖాతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు తూర్పు గాలుల ద్రోణి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే వీలుంది. వీటితో పాటు మిగిలిన జిల్లాల్లోనూ అక్కడక్కడ చెదురుమదురు జల్లులు పడే అవకాశముందని అధికారులు తెలిపారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పుల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో ప్రజలు ఎవరూ చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండవద్దని స్పష్టం చేసింది. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు వర్షం పడే సమయంలో సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని విజ్ఞప్తి చేసింది. అత్యవసరమైతే తప్ప వర్షం, పిడుగుల సమయంలో బయటకు రావద్దని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, అధికారులు ఎప్పటికప్పుడు తాజా వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

పసిఫిక్‌లో పెను ముప్పు.. 10 డిగ్రీలు పెరిగిన వేడి!

పసిఫిక్ మహాసముద్రంలో అసాధారణ వాతావరణ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. గాలాపగోస్ దీవులు, పెరూ తీరానికి సమీపంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఏకంగా 10 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీవ్రరూపం దాల్చుతున్న ఎల్ నినో ప్రభావమే ఇందుకు కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మౌ, ఈ పరిణామాన్ని 'మెగా ఎల్ నినో'గా అభివర్ణించారు. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ (ఈసీఎండబ్ల్యూఎఫ్) డేటా ఆధారంగా రూపొందించిన మ్యాప్‌ను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. అయితే, ఈ తీవ్రమైన వేడి పసిఫిక్‌లోని తూర్పు ప్రాంతంలోని ఒక హాట్‌స్పాట్‌కు మాత్రమే పరిమితమైందని, మొత్తం పసిఫిక్ మహాసముద్రం 10 డిగ్రీలు వేడెక్కిందని దీని అర్థం కాదని నిపుణులు వివరిస్తున్నారు. పసిఫిక్‌లోని విస్తృత మధ్య ప్రాంతాల్లో సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఈ ఎల్ నినో గణనీయంగా బలపడిందని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఏఏ) కూడా ధ్రువీకరించింది. 1950 నుంచి నమోదైన ఎల్ నినో రికార్డులను ఇది అధిగమించే అవకాశం 60% ఉందని ఎన్ఓఏఏ అంచనా వేస్తోంది. ముఖ్యంగా 1997-98, 2015-16 నాటి శక్తిమంతమైన ఎల్ నినోలను ఇది మించిపోవచ్చని పేర్కొంది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. చరిత్రలో నమోదైన అత్యంత శక్తిమంతమైన ఎల్ నినోలలో ఇది ఒకటిగా నిలవొచ్చని తెలిపింది.ఈ ఎల్ నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం ఉందని, దీనివల్ల రాబోయే నెలల్లో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని డబ్ల్యూఎంవో హెచ్చరించింది. ఎల్ నినో సమయంలో ఉష్ణమండల సముద్రంలో నిల్వ ఉన్న వేడి వాతావరణంలోకి విడుదల కావడమే ఇందుకు కారణమని వివరించింది. కాగా, గత అక్టోబర్‌లోనే పెరూ తీరం, గాలాపగోస్ పశ్చిమ జలాల్లో 6 నుంచి 7 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుదల కనిపించిందని యూరోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ డేటా వెల్లడించింది.

సెప్టిక్ ట్యాంక్‌లో మృత్యుపాశం.. ముగ్గురు బలి!

హైదరాబాద్‌లోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ అపార్ట్‌మెంట్‌లోని సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన ముగ్గురు కార్మికులు విషవాయువులు పీల్చి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బాచుపల్లి పరిధిలోని ఏపీఆర్ ఎన్‌క్లేవ్, దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్‌లో ఈ దుర్ఘటన జరిగింది. మృతులను శ్రీకాకుళం జిల్లాకు చెందిన పవన్ యల్లా (20), కె.షణ్ముఖరావు అలియాస్ సుమన్ (26), సురేష్ (24)గా గుర్తించారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ముగ్గురు యువకులు ఇలా అర్ధాంతరంగా మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర శోకం అలుముకుంది.దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్ యాజమాన్య సంఘానికి, 'హెచ్ఆర్ ఇన్విరో' అనే ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థకు మధ్య సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే పనులకు సంబంధించి ఒప్పందం ఉంది. అపార్ట్‌మెంట్ ప్రతినిధుల అభ్యర్థన మేరకు సదరు సంస్థ సిబ్బంది తరచూ ఇక్కడ క్లీనింగ్ పనులు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా హెచ్ఆర్ ఇన్విరో సంస్థకు చెందిన ముగ్గురు కార్మికులు సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయడానికి అపార్ట్‌మెంట్‌కు వచ్చారు. పని ప్రారంభించే క్రమంలో ఒకరి తర్వాత ఒకరు ట్యాంకు లోపలికి దిగారు. అయితే ట్యాంక్ లోపల తీవ్రమైన విషవాయువులు పేరుకుపోయి ఉండటంతో వారు ఊపిరాడక స్పృహతప్పి పడిపోయారు. ఎంతసేపటికీ వారు బయటకు రాకపోవడంతో తోటి సిబ్బంది, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురై పోలీసులకు, అత్యవసర విభాగాలకు

సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్ నేతృత్వంలోని డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్యాంక్ లోపల దట్టమైన విషవాయువులు వ్యాపించి ఉండటంతో సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి. అయినప్పటికీ హైడ్రా, ఫైర్ సిబ్బంది సంయుక్తంగా శ్రమించి, పాతాళకాంత వంటి ప్రత్యేక రెస్క్యూ పరికరాల సాయంతో ముగ్గురి మృతదేహాలను ట్యాంక్ నుంచి బయటకు తీశారు.

సెప్టిక్ ట్యాంక్‌లో నిల్వ ఉన్న ప్రమాదకరమైన విషపూరిత వాయువులను పీల్చడం వల్లే ఊపిరాడక వారు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ పనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రష్యాకు యుద్ధ దెబ్బ.. 4.9 లక్షల మంది మృతి?

- మొదటి పేజి తరువాయి

కొందరు సైనికులు బలవన్మరణానికీ పాల్పడినట్లు తేలింది. రష్యాలో ఇటీవల లీకైన ప్రభుత్వ రికార్డులను విశ్లేషించిన కొన్ని మీడియా సంస్థలు ప్రాణనష్ట అంచనాలను వెల్లడించాయి.దేశంలో జనన, మరణాలకు సంబంధించిన రికార్డులను నమోదు చేసే ఫెడరల్ స్టేట్ స్టాటిస్టిక్స్ సర్వీస్ ఏజెన్సీ డేటా ఇటీవల హ్యాకింగ్‌కు గురైంది. లీకైన డేటాలో జనవరి 2021 నుంచి సెప్టెంబర్ 2026 వరకు నమోదైన లక్షలాది పౌరుల మరణ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. వీటిని విశ్లేషించిన స్థానిక మీడియా సంస్థలు.. ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికే కనీసం 4.9లక్షల మంది రష్యన్ సైనికులు మరణించినట్లు గుర్తించాయి. మరణాల నమోదులో జాప్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ సంఖ్య 7లక్షల వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేశాయి.ఈ రికార్డులను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల గణాంకాలతో పోల్చి చూశామని, ఇవన్నీ సరైనవేనని ధ్రువీకరించుకున్నట్లు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. మరణించిన రష్యన్ సైనికుల సగటు వయసు 2022లో 33గా ఉండగా.. 2026లో 40గా ఉన్నట్లు తెలిపాయి. చనిపోయిన వారిలో దాదాపు 7వేల మంది వయసు 18-19గా గుర్తించినట్లు చెప్పాయి. అయితే, వీరంతా నిర్బంధ సైనిక సేవకులే కావచ్చని అంచనా వేశాయి.

వందలాది ఆత్మహత్యలు..?

మరోవైపు, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా అనేక మంది రష్యన్ సైనికులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఐదేళ్ల కాలంలో సుమారు 1229 మంది సైనికులు బలవన్మరణాలకు పాల్పడినట్లు అంచనా. వీరిలో సగం మంది సరిహద్దు ప్రాంతాల్లోనే చనిపోయినట్లు భావిస్తున్నారు. ఇవన్నీ సైనిక శిబిరాలు, శిక్షణా కేంద్రాలు, ప్రైవేటు నివాసాల్లో చోటుచేసుకున్నట్లు వార్తా సంస్థల విశ్లేషణలో తేలింది. యుద్ధంలోకి పంపే విషయంలో ఒప్పందాలపై సంతకాలు చేయాలని తీవ్ర ఒత్తిడి చేయడమే బలవన్మరణాలకు ప్రధాన కారణంగా అనుమానిస్తున్నారు.ఇదిలాఉంటే, యుద్ధంలో ప్రాణ నష్టానికి సంబంధించి రష్యా చివరిసారిగా 2022లో గణంకాలను విడుదల చేసింది. ఉక్రెయిన్‌పై యుద్ధం మొదలైన తర్వాత పూర్తి వివరాలు వెల్లడించలేదు. వీటిపై వచ్చే స్వతంత్ర నివేదికలకు విశ్వసనీయత లేదని రష్యా ప్రభుత్వం చెబుతోంది. రోస్టాట్ నుంచి కూడా డేటా లీక్ కాలేదని చెప్పడం గమనార్హం.

హిజాబ్ లేకుండా పాట.. గాయనికి 74 కొరడా దెబ్బలు!

- మొదటి పేజి తరువాయి

యూట్యూబ్‌లో నిర్వహించిన సంగీత ప్రదర్శనలో ఆమె హిజాబ్ లేకుండా కనిపించడమే ఇందుకు కారణం.ఇరాన్‌కు చెందిన ప్రముఖ గాయని పరస్తూ అహ్మదీ ఈ శిక్షకు గురయ్యారు. 2024 డిసెంబర్‌లో ఖోమ్ నగరంలో ఆమె సంగీత ప్రదర్శన ఇచ్చారు. నలుగురు గాయకులతో కలిసి హిజాబ్ లేకుండా పాటలు పాడారు. ఆ సమయంలో అక్కడ ప్రేక్షకులు కూడా ఎవరూ లేరు. ఈ ప్రదర్శనకు సంబంధించిన వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయగా మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఇరాన్ న్యాయస్థానం.. అహ్మదీతో పాటు ఆమె బృందంలోని వారికి ఒక్కొక్కరికి 74 కొరడా దెబ్బల శిక్ష విధించింది. అంతేకాదు.. రెండేళ్ల పాటు విదేశీ ప్రయాణాలు, కళా, సంగీత కార్యకలాపాలపై నిషేధం విధించింది. తాజాగా నవంబర్ 23న గాయని అహ్మదీతో పాటు నలుగురు బృంద సభ్యులకు 74 కొరడా దెబ్బల శిక్ష అమలు చేసినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. కాగా.. అమినీ అనే యువతి 2022లో హిజాబ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలతో నైతిక పోలీసులు (వీశీఝీశ్రీఱ్ఎ ౨్రాశీశ్రీఱఎవ) అదుపులోకి తీసుకోగా.. కస్టడీలో మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ఇరాన్‌లో మహిళల హక్కులపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా ఘటన మరోసారి అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. మహిళల వస్త్రధారణ, భావప్రకటనా స్వేచ్ఛపై ఇరాన్‌లో కొనసాగుతోన్న ఆంక్షలకు ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది.

ఆస్తులు తీసుకుని.. వదిలేస్తే జైలుకే!

తల్లిదండ్రుల నుంచి ఆస్తులు రాయించుకుని, ఆ తర్వాత వారిని పట్టించుకోకుండా గాలికొదిలేసే పిల్లలకు కేరళం ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. అలాంటి బాధ్యతారహిత సంతానానికి ఏకంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా కొత్త చట్టాన్ని తీసుకొచ్చినట్లు కేరళం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ సంచలన ప్రకటన చేశారు. సీనియర్ సిటిజన్ల సంరక్షణ, హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర అసెంబ్లీ అక్టోబర్‌లో ఆమోదించిన నూతన బిల్లులో ఈ కీలక నిబంధనను చేర్చినట్లు స్పష్టం చేశారు. కొల్లం సమీపంలోని పతనపురంలో గల గాంధీభవన్‌లో రూ.20 కోట్ల వ్యయంతో వృద్ధుల కోసం అత్యాధునిక వసతులతో నిర్మించిన 'పితృమందిరం' నివాస సముదాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఈ వివరాలు వెల్లడించారు.యూడీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీసుకున్న తొలి నిర్ణయం వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయడమేనని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే ఇలాంటి శాఖను నెలకొల్పిన తొలి రాష్ట్రం కేరళం అని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా వయోవృద్ధులకు పలు విశేష హక్కులను కల్పిస్తూ సమగ్ర చట్టాన్ని తెచ్చామని వివరించారు. గవర్నర్ ఆమోదం లభించి ఈ చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి రాగానే, తల్లిదండ్రులను మోసం చేసే పిల్లలను కచ్చితంగా జైలుకు పంపుతామని, ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదని గట్టిగా చెప్పారు.పిల్లలను పెంచి పెద్ద చేయడానికి తల్లిదండ్రులు ఎంతటి కష్టాలు, త్యాగాలు భరిస్తారో సమాజం తెలుసుకోవాలని సతీశన్ ఉద్వేగంగా మాట్లాడారు. ఎదిగి పెద్ద స్థాయికి చేరిన తర్వాత కన్నవారిని అనాథలుగా వదిలేసే సంస్కృతి కేరళంలో ఉండకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను గుండెలకు హత్తుకుని చూసుకునే సరికొత్త సంస్కృతి సమాజంలో రావాలని, రాష్ట్రంలో ఏ ఒక్క వృద్ధుడూ ఒంటరి కాకూడదన్నదే తన ఆశయమని తెలిపారు. కాగా, ఈ పితృమందిరం నిర్మాణానికి పూర్తి ఆర్థిక సాయం అందించిన లులు గ్రూప్ ఛైర్మన్ ఎం.ఎ.యూసుఫ్ అలీని సీఎం కొనియాడారు. ఎంత సంపద ఉన్నా ఇతరులకు సాయం చేసే గొప్ప గుణం ఆయనకు ఉందని ప్రశంసించారు.

1,008 కిలోల నెయ్యి, 1503 మీటర్ల వత్తి..

- మొదటి పేజి తరువాయి

ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలిరావడంతో కొండ ప్రాంతం కిక్కిరిసిపోయింది. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల హరహర మహదేవ, శంభో శంకర నామస్మరణల మధ్య అఖండ దీపాన్ని వెలిగించారు. కొండపై ఏర్పాటు చేసిన ఆరు అడుగుల కొప్పెరలో 1008 కిలోల స్వచ్ఛమైన ఆవు నెయ్యి పోసి 1,503 మీటర్ల పొడవైన వత్తితో మహా దీపాన్ని ప్రజ్వలింపజేశారు. ఆ దివ్యజ్యోతి వెలుగులు సమీప గ్రామాల ప్రజలను కనువిందు చేశాయి. ఈ మహాక్రతువును కనులారా వీక్షించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా విచ్చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏకవీర సేవా ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక యువత అన్నదానం, తాగునీటి సౌకర్యాలు కల్పించారు.

బాబాయ్‌ను దొంగ అన్నాడని.. క్లాస్‌మేట్ చెంప పగలగొట్టా!

- మొదటి పేజి తరువాయి

రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ సందర్భంగా సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఈ సంభాషణలో సోనియా గాంధీతో పాటు రాహుల్, ప్రియాంక పాల్గొన్నారు. 1977 ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఓటమి పాలైన తర్వాతి రోజులను ప్రియాంక ఈ సందర్భంగా ప్రస్తావించారు.ఆ సమయంలో పాఠశాలలో ఒక బాలుడు తన వద్దకు వచ్చి "తేరా చాచా జైల్ మే హై, చోర్ హై తేరా చాచా" (మీ బాబాయ్ జైల్లో ఉన్నాడు.. మీ బాబాయ్ ఒక దొంగ) అని సంజయ్ గాంధీని ఉద్దేశించి దూషించాడని ప్రియాంక తెలిపారు. ఆ మాట వినగానే తీవ్ర కోపంతో ఆ బాలుడి చెంప పగలగొట్టానని ఆమె చెప్పారు. దెబ్బ తిన్న ఆ పిల్లాడు ఏడుస్తూ టీచర్‌కు ఫిర్యాదు చేయడంతో, చివరకు తనకు చీవాట్లు పడ్డాయని ఆమె నవ్వుతూ గుర్తు చేసుకున్నారు.ఇదే క్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత తనకూ పాఠశాలలో క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయని వివరించారు. ఆ సమయంలో తరగతి గదిలో తన పక్కన కూర్చోవడానికి ఎవరూ ఇష్టపడలేదని తెలిపారు. అంతేకాకుండా, తన ఏడో పుట్టినరోజు వేడుకలకు స్నేహితులను ఆహ్వానించినప్పటికీ దాదాపు ఎవరూ రాలేదని ఆయన పేర్కొన్నారు.విద్యార్థులుగా తమ ఇద్దరి వ్యక్తిత్వాల మధ్య ఉన్న తేడాలను కూడా ఈ సందర్భంగా వారు వెల్లడించారు. తాను క్రమశిక్షణతో ఉంటూ, పాఠశాల నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించే వ్యక్తినని, స్కూల్ ప్రిఫెక్ట్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించానని ప్రియాంక చెప్పారు. మరోవైపు రాహుల్ మాత్రం తాను కాస్త తిరుగుబాటు ధోరణితో ఉండేవాడినని, ఉపాధ్యాయులను ఎక్కువగా ప్రశ్నలు అడుగుతూ క్లాస్‌లో కాస్త గందరగోళం సృష్టించేవాడినని సరదాగా అంగీకరించారు.కాగా, సోనియా గాంధీ రాసిన తాజా పుస్తకంలో ఎమర్జెన్సీ సమయంలో సంజయ్ గాంధీ పోషించిన పాత్ర, ఆ పరిణామాలపై ఇందిరా గాంధీలో కలిగిన భావనల వంటి పలు చారిత్రక కోణాలను స్పృశించారు. ప్రస్తుతం రాహుల్, ప్రియాంకల చిన్ననాటి ముచ్చట్లకు సంబంధించిన ఈ వీడియో నెట్టింట ఆసక్తికరంగా మారింది.

స్టిమ్యులై ఐక్యూలో వీఐఐటీ ఎంబీఏ విద్యార్థులకు కొలువులు



-12 మందికి ఉద్యోగాలు.. ఏడాదికి రూ.6.5 లక్షల వేతన ప్యాకేజ

గాజువాక :పెన్ పవర్ ,నవంబర్ 21 దువ్వాడలోని విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థులు ప్లేస్‌మెంట్లలో సత్తా చాటారు. కళాశాలలో నిర్వహించిన 2027 ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రముఖ సంస్థ స్టిమ్యులై ఐక్యూకు ఎంబీఏ విభాగానికి చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ. 6.5 లక్షల వేతన ప్యాకేజీ లభించనుంది. విద్యార్థులకు నాణ్యమైన మేనేజ్‌మెంట్ విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ అందించడం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం, ప్రముఖ సంస్థలతో అనుసంధానం కల్పించడం వంటి కళాశాల ప్రయత్నాలకు ఈ నియామకాలు నిదర్శనంగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభ, అంకితభావం, వృత్తిపరమైన సామర్థ్యాలకు ఈ ఎంపికలు గుర్తింపుగా నిలిచాయి.ఈ సందర్భంగా వీఐఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సుధాకర్, రెక్టర్ డాక్టర్ వి. మధుసూధన రావు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. డీన్ ప్లేస్‌మెంట్స్ డాక్టర్ బి. ప్రసాద్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ బి. చంద్రతో పాటు పలువురు డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తామని కళాశాల యాజమాన్యం తెలిపింది .



చెత్తకు తెరపడింది – కదిలిన జీవీఎంసీ యంత్రాంగం

పశువుల కబేళా,పూజా వ్యర్థాలతో కలుషితమవుతున్న ముడసర్లోవ రిజర్వాయర్ – కాలువలకు తెరలు ఏర్పాటు





విశాఖ తూర్పు, పెన్ పవర్, నవంబర్ 24:ముడసర్లోవ రిజర్వాయర్‌లో పశువుల కబేళా వ్యర్థాలు, పూజా సామగ్రి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.ఆరిలోవ ప్రాంతంలో అయ్యప్ప స్వాములు,కార్తీక మాసంలో స్థానికులు పూజలు చేసిన తర్వాత పూలు,పత్రి, ఇతర సామగ్రిని సంచులతో తెచ్చి నీటిలో వేస్తున్నారు. ఆ వ్యర్థాలు నీటిలో కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నది. ఆరిలోవ ప్రాంతానికి సరఫరా అయ్యే తాగునీరు కూడా కలుషితమవుతున్నది.కొండ నుంచి రిజర్వాయర్‌కు వరద నీరు ప్రవహించేందుకు నిర్మించిన కల్వర్టుల్లోనూ వీటిని వేస్తున్నారు. అవి కుప్పలుగా పేరుకుపోయి వర్షం నీరు పారేందుకు అడ్డంకిగా మారుతున్నాయి. దుర్వాసనతో అటుగా వెళ్లే వాకర్స్, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.ఈ విషయంపై 16వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒమ్మి చిట్టిబాబుకు తెలియజేయగా ఆయన వెంటనే స్పందించారు. సిబ్బందితో కలిసి పలు ప్రాంతాలను గుర్తించి, రిజర్వాయర్ కాలువలను శుభ్రపరిచి, చెత్త వేయకుండా ఆయా ప్రాంతాల్లో తెరలు ఏర్పాటు చేయించారు.నీటిలో, కల్వర్టుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది తరచూ తొలగించాల్సి వస్తున్నది.ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా నిర్మాణంతో ఇనుప కంచె జాలీలు వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



గూడెంకొత్తవీధి మండలంలో ముగిసిన ప్రచార పర్వం



ఓటరు తీర్పుపైనే అందరి దృష్టి.. ముగిసిన అభ్యర్థుల హోరాహోరీ ప్రచారం

గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 24:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలో పంచాయతీ ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు చివరి రోజు వరకు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారం, గ్రామసభలు, రోడ్‌షోలు, మైకుల ద్వారా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.ప్రచార గడువు ముగియడంతో అభ్యర్థుల ప్రచార సందడి సద్దుమణిగింది. ఇప్పటివరకు తమకు మద్దతుగా నిలిచిన ఓటర్లను పోలింగ్ రోజున ఓటు వేసేలా అభ్యర్థులు చివరి ప్రయత్నాలు చేశారు.ప్రచారం ముగియడంతో ప్రస్తుతం అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. గ్రామాల్లో ఎవరి వైపు ఓటర్లు మొగ్గు చూపుతారన్నది ఆసక్తికరంగా మారింది. ప్రచార హోరాహోరీకి తెరపడటంతో ఇప్పుడు అందరి దృష్టి ఓటరు తీర్పుపైనే కేంద్రీకృతమైంది.

"నల్లగొండ" లో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో భారీ చేరికలు...!



కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 24: కొయ్యూరు మండలంలోని నల్లగొండ పంచాయతీ కేంద్రంలో తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరింది.వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామ వార్డు సభ్యులు పల్లి చిన్నారావు, వంతల కుమారి తమ అనుచరులు,సుమారు 100 మంది సభ్యులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి,జిసిసి మాజీ వైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు కాకూరి చంద్రరావు నూతనంగా పార్టీలో చేరిన సభ్యులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎం.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ...తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు,పార్టీ నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం తెలియజేశారు.గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.రాబోయే స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో కూడా కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవడం ప్రతి పార్టీ కార్యకర్త బాధ్యత అని ఆయన అన్నారు.నల్లగొండ పంచాయతీ కేంద్రంలో జరిగిన ఈ చేరికలు గ్రామస్థాయిలో తెలుగుదేశం పార్టీకి మరింత బలాన్ని చేకూర్చాయని, నూతనంగా చేరిన సభ్యుల సహకారంతో పార్టీ ప్రజా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి: ఎంపీడీవో రమణబాబు

వంద శాతం పోలింగ్ నమోదుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



గూడెంకొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 24: ఈ నెల 26న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జీకేవీధి ఎంపీడీవో రమణబాబు పిలుపునిచ్చారు. ఎన్నికల రోజున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకమని, ప్రతి ఓటరు బాధ్యతగా పోలింగ్ కేంద్రానికి తరలివచ్చి ఓటు వేయాలని కోరారు. ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పత్రికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వంద శాతం పోలింగ్ నమోదుకు ప్రతి ఒక్కరూ సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్సీపీ బలపరిచిన అభ్యర్థులకు గెలిపించుకుందాం..!





- గ్రామ పంచాయితీ అభివృద్ధి చేసుకుందాం..!
- ఎన్నికల ప్రచారంలో బ్రహ్మరథం పట్టిన పంచాయితీ ప్రజలు..

కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 24: కొయ్యూరు మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పాడేరు శాసన సభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు. మంగళవారం ఈ సందర్భంగా కొయ్యూరు మండలంలో డౌనూరు, మూలపేట, చిట్టంపాడు, ఆడకుల, కంటరం,చింతలపూడి, కొయ్యూరు,చీడిపాలెం, రాజేంద్రపాలెం,బుదరాళ్ల పంచాయతీల్లో పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో శాసన సభ్యులు జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు పాల్గొన్నారు.
ఎన్నికల ప్రచారంలో ప్రజలతో శాసన సభ్యులు మాట్లాడుతూ... కూటమి పార్టీ నాయకులు మూడు జెండాలు పట్టుకుని ప్రచారానికి వస్తారు ఎవరు ఏ హామీ ఇస్తారో వారికే అర్థం కాదు, కానీ మన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి ఒకడే అభ్యర్థి మీ గ్రామ అభివృద్ధి కోసం మీ అందరికి అందుబాటులో ఉండి ప్రతి సమస్యకి తోడుగా ఉంటారు, కావున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ప్రజలందరూ మద్దతు ఇచ్చి ఆశీర్వదించండి, మంచి మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ బడుగు రమేష్ బాబు,మండల పార్టీ అధ్యక్షుడు బిడిజన అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షులు గాడి సత్యనారాయణ,మాజీ వైస్ ఎంపీపీ అప్పన్న వెంకట రమణ, జిల్లా జనరల్ సెక్రటరీ పొట్టిక పోతురాజు, సుమర్ల సూరిబాబు,మాజీ సర్పంచులు ఆగురు జోగరాజు, పొట్టిక భవాని, రావుల వెంకటలక్ష్మి, నాయకులు దుంప రాజబాబు, వివిధ పార్టీ హోదాలో ఉన్న నాయకులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పసుపులేటి బాలరాజుకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు:

స్థానిక సంస్థల ప్రచార నేపథ్యంలో భాగంగా మాజీ మంత్రి, వైయస్సార్సీపి సీఈసీ సభ్యులు పసుపులేటి బాలరాజు మండలంలోని ఎం మాకవరం చింతలపూడి పంచాయతీలో విస్తృతంగా వైఎస్ఆర్సిపి తరఫున ప్రచారం నిర్వహించారు. ఎం మాకవరం, చింతలపూడి పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులలను గెలిపించాలని స్థానికంగా సమస్యలు పరిష్కారం వీలవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెండు పంచాయతీలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ప్రతిష్ట ముఖ్యమని భావించి పోటీ నుంచి వైదొలిగాను.

- పోతురాజుదేవుడమ్మ
- ఆదరించిన గ్రామ ప్రజలకు క్షమాపణలు.
- ప్రస్తుత అభ్యర్థిపుష్పలతను గెలిపించాలని విజ్ఞప్తి .



చింతపల్లి, నవంబర్ 24.స్థానిక పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైకాపా) అభ్యర్థినిగా సర్పంచ్ బరిలో నిలిచిన చింతపల్లి తాజా మాజీ జడ్పీటీసీ పోతురాజు బాలయ్య సతీమణి దేవుడమ్మ, కేవలం పార్టీ ప్రయోజనాలు, ప్రతిష్ట కోసమే పోటీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా చింతపల్లి గ్రామ ప్రజలకు నమస్కారాలు తెలుపుతూ ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ?చింతపల్లి పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో గెలిచి, పంచాయతీని మరింత అభివృద్ధి చేయాలని ఎంతో తపన పడ్డానని, కానీ ఆ కల నెరవేరలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది చేస్తున్న స్వార్థ రాజకీయాల వల్ల పార్టీకి ఎటువంటి నష్టం వాటిల్లకూడదనే సదుద్దేశంతోనూ, పార్టీ నిలబడాలనే లక్ష్యంతోనూ తాను పోటీ నుంచి విరమించుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తన భర్త పోతురాజు బాలయ్య గతంలో జడ్పీటీసీగా పనిచేసి మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ఇప్పటికీ పార్టీ కోసం పూర్తి నిబద్ధతతో పనిచేస్తూ ముందుకు సాగుతున్నారని దేవుడమ్మ గుర్తు చేశారు. ఆయన సేవలను, పార్టీపై ఉన్న విధేయతను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో తనకు అండగా నిలిచి, ఎంతో ఆదరించి, అభిమానించి సహకరించాలని భావించిన చింతపల్లి గ్రామ ప్రజలందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి తరుణంలో పోటీ నుంచి తప్పుకున్నందుకు గ్రామ ప్రజలు తనను క్షమించాలని ఆమె వినమ్రంగా కోరారు. పదవులు ఉన్నా లేకపోయినా భవిష్యత్తులోనూ తన భర్తతో కలిసి పార్టీ శ్రేయస్సు కోసం పాటుపడతానని, అలాగే ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని దేవుడమ్మ స్పష్టం చేశారు.

అలాగే, ప్రస్తుతం పార్టీ తరపున క్యారెట్ గుర్తుతో పోటీ చేస్తున్న అభ్యర్థి దురియా పుష్పలతకి చింతపల్లి గ్రామ ప్రజలందరూ తమ సంపూర్ణ సహకారం అందించి గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

నూతన ఎంపీపీకి లకవరపేటలో నీరాజనం.. పూజారి లీలాప్రసాద్‌కు ఘన సన్మానం!



గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 24:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం లకవరపేట గ్రామంలో జీకేవీధి మండల నూతన ఎంపీపీగా ఎన్నికైన పూజారి లీలాప్రసాద్‌కు మంగళవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనను ఆత్మీయంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లకవరపేట సర్పంచ్ అభ్యర్థి వంతల సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ ప్రేమకుమారి తదితరులు పాల్గొని పూజారి లీలాప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా లీలాప్రసాద్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సహకారంతో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ం

నందిక కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి.

- స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు



గుమ్మలక్ష్మీపురం. నవంబర్ 24 పెన్ పవర్.మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో 6వ తరగతి చదువుతూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విద్యార్థిని నందిక కుటుంబాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బి.అనిల్ డిమాండ్ చేశారు.మృతురాలి కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురం ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి.అనిల్ మాట్లాడుతూ,ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు,కేజీబీవీలలో చదువుతున్న గిరిజన,పేద విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.సరైన వైద్య సదుపాయాలు,పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నందిక మరణంతో ఆమె కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని,ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు తక్షణమే రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.అలాగే,కేజీబీవీలలో పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించి,విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీరు నేలపాలు.. పట్టించుకోని అధికారులు!

- వీధి కొళాయిలకు ట్యాపులు లేక వృథాగా పోతున్న విలువైన జలం.
- స్థానికులు ఏర్పాటు చేసినా ధ్వంసం చేస్తున్న ఆకతాయిలు.
- దృఢమైన ట్యాపులు ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి.



చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 23. మండల కేంద్రంలో తాగునీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఓవైపు ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు అందుబాటులో ఉన్న నీరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వృథాగా కాలువల పాలవుతోంది. వీధి కొళాయిలకు ట్యాపులు ఏర్పాటు చేయకపోవడంతో నీరు నిరంతరం ప్రవహిస్తూ మురుగు కాలువల్లో కలుస్తోంది. చింతపల్లి మైలుకూలి వీధి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న వీధి కొళాయికి ట్యాప్ లేకపోవడంతో తాగునీరు వృథాగా ప్రవహిస్తోంది. ఇదే పరిస్థితి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వీధి కొళాయి వద్ద కూడా నెలకొంది. పలుమార్లు సంబంధిత అధికారులకు సమస్యను విన్నవించినా స్పందన లేకపోవడంతో విసిగిపోయిన స్థానికులు తమ సొంత ఖర్చులతో ట్యాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే రాత్రి వేళల్లో కొందరు ఆకతాయిలు, మద్యం సేవించే వ్యక్తులు వాటిని ధ్వంసం చేస్తుండటంతో సమస్య మళ్లీ మొదటికొస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడాల్సిన తాగునీరు ఇలా వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి మైలుకూలి వీధి, రామాలయం పరిసరాల్లోని వీధి కొళాయిలకు నాణ్యమైన, దృఢమైన ట్యాపులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వాటి నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైకాపా అభ్యర్థుల విజయమే లక్ష్యంగా హోరెత్తిన ప్రచారం



- కుడుముసారి, బలపం పంచాయతీల్లో వైకాపా నాయకుల ఇంటింటా ప్రచారం
- ఎంపీపీ, జెడ్పీటీసీ, మాజీ జెడ్పీటీసీ ఆధ్వర్యంలో విస్తృత పర్యటన

చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 24.మండలంలో ఈ నెల 26న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో వైకాపా బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఆ పార్టీ నాయకులు మంగళవారం తుది రోజు ప్రచారాన్ని హోరెత్తించారు. ఎంపీపీ పొట్టుకూరి దేవి, జెడ్పీటీసీ సభ్యురాలు కోరాబు అనూష దేవి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య ఆధ్వర్యంలో కుడుముసారి, బలపం పంచాయతీల్లో విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి గడపకూ వెళ్లి ఓటర్లను నేరుగా కలుసుకున్న నాయకులు, అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తులను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కుడుముసారి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కొర్ర సుబ్బారావుకు కేటాయించిన వంకాయ గుర్తుపై, అలాగే బలపం పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కోరాబు ఎస్తేరమ్మకు కేటాయించిన కత్తెర గుర్తుపై ఓటు వేసి వారిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ ప్రచార వేగాన్ని మరింత పెంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ ఏమాత్రం తగ్గలేదని, ప్రచారంలో తమ నాయకులకు స్థానిక గిరిజనులు బ్రహ్మరథం పడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపు తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి జరగాలంటే వైకాపా బలపరిచిన అభ్యర్థుల గెలుపు అత్యంత అవసరమని నాయకులు ఓటర్లకు పిలుపునిచ్చారు. తుది రోజు ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.

అల్లూరి జిల్లా నూతన జడ్పీ చైర్‌పర్సన్ వంతల శాంతికి ఘన సన్మానం.



మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన చింతపల్లి వైకాపా శ్రేణులు.

చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 24 .అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వంతల శాంతి దంపతులను చింతపల్లి మండల వైకాపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మంగళవారం చింతపల్లిలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వంతల శాంతి దంపతులు హాజరయ్యారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వైకాపా శ్రేణులు వారిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వంతల శాంతికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె నాయకత్వంలో జిల్లా, ముఖ్యంగా మన్యం ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, వైకాపా బలపరిచిన ప్రస్తుత సర్పంచ్ అభ్యర్థిని దురియా పుష్పలత, హేమంత్ దంపతులు, వైకాపా రాష్ట్ర గిరిజన విభాగం ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జల్లి హలియా రాణి దంపతులు, పాడేరు పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సాగిన గంగన్న పడాల్ తదితరులు పాల్గొన్నారు.

తాజంగి రిజర్వాయర్‌ను పరిశీలించిన నిపుణుల కమిటీ



డ్యామ్ సేఫ్టీపై అధికారులకు పలు సూచనలు.

చింతపల్లి పెన్ పవర్ నవంబరు 24 .మండలంలోని తాజంగి రిజర్వాయర్‌ను రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లతో కూడిన నిపుణుల కమిటీ మంగళవారం ఉదయం పరిశీలించింది. సమగ్ర డ్యామ్ సేఫ్టీ మూల్యాంకన నివేదిక తయారీ నిమిత్తం రిటైర్డ్ సీఈలు చిట్టిబాబు, ఎం.టి.రాజు, పోలేశ్వరరావు క్షేత్రస్థాయిలో పర్యటించారు. రిజర్వాయర్ పరిసరాలు, కుడి, ఎడమ కాలువలను తనిఖీ చేశారు. ప్రధాన నిర్మాణాలు, స్లూయిస్ గేట్లు, సర్‌ప్లస్ వీర్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం డ్యామ్ భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ పరిశీలనలో పాడేరు ఎస్ఎంఐ ఈఈ ఎం.రాజేంద్రకుమార్, చింతపల్లి డీఈఈ ఆర్.రాజేశ్వరరావు, ఏఈఈ కె.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే

- గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ అభ్యర్థి మూటక విజయలక్ష్మికి మద్దతుగా కురుపాం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం.



గుమ్మలక్ష్మీపురం నవంబర్ 24 పెన్ పవర్. మండల కేంద్రంలోని గుమ్మలక్ష్మీపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి మూటక విజయలక్ష్మి కు మద్దతుగా ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్,కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ఎన్నికల ప్రచారంలో పాల్గొని గ్రామంలోని ప్రజలను,ఓటర్లను నేరుగా కలుసుకున్నారు.సర్పంచ్ అభ్యర్థి మూటక విజయలక్ష్మి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,గుమ్మలక్ష్మీపురం గ్రామ అభివృద్ధి,ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మూటక విజయలక్ష్మి కి ప్రతి ఒక్కరూ తమ సంపూర్ణ మద్దతు అందించాలని కోరారు.విజయలక్ష్మి ఎన్నికల బరిలో వంకాయ గుర్తుపై పోటీ చేస్తున్నారని,ఓటర్లు తమ అమూల్యమైన ఓటును వంకాయ గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం మండల వైస్ ఎంపీపీ సొంటేన రమ్య,కూటమి నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్ వంతల శాంతికి అభినందనల వెల్లువ.. ఘనంగా సన్మానం

- జడ్పీ చైర్‌పర్సన్ వంతల శాంతికి ఘన సన్మానం
- పెదవలసలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 24:అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన వంతల శాంతిని పెదవలస గ్రామ పంచాయతీలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధితో పాటు మారుమూల గ్రామాల ప్రగతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని అభిలషించారు.ఈ కార్యక్రమంలో నూతన జడ్పీటీసీ కంకిపాటి గిరి ప్రసాద్, మాజీ ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు లమ్మసింగి రమేష్, మండల ఎస్టీ స్పెషల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, దేశేటి రాంబాబు, సిరబల రామారావు, గుంట ధనుర్జ, పంచాయతీ అధ్యక్షుడు కంకిపాటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో హోరెత్తిన కూటమి ప్రచారం.. సర్పంచ్ బరిలో దూసుకెళ్తున్న రీమల వరహాలమ్మ

- తుది రోజు ఇంటింటి ప్రచారంలో పాల్గొని శ్రేణుల్లో ఉత్సాహం నింపిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి.
- 'గొలుసు' గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు పిలుపు.



చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 24 . చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. ఈ నెల 26న జరగనున్న ఎన్నికలకు సంబంధించి కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రీమల వరహాలమ్మ తనదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తూ దూసుకెళ్తున్నారు. పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆశీస్సులతో, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు సతీమణి అయిన వరహాలమ్మ బరిలోకి దిగి, 'గొలుసు' గుర్తుతో పంచాయతీ పరిధిలో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి తుది రోజైన మంగళవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో గిడ్డి ఈశ్వరి స్వయంగా పాల్గొనడంతో కూటమి శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. గిడ్డి ఈశ్వరి నేతృత్వంలో అభ్యర్థి వరహాలమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పంచాయతీలోని ప్రతి గడపకూ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చింతపల్లి అభివృద్ధికి తమకున్న ప్రణాళికలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, చింతపల్లి మేజర్ పంచాయతీ సమగ్ర అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థి రీమల వరహాలమ్మను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నాయకత్వాన్ని ఎన్నుకుంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఈ నెల 26న జరగనున్న ఎన్నికల్లో ఓటర్లంతా 'గొలుసు' గుర్తుపై ఓటు వేసి వరహాలమ్మకు భారీ మెజారిటీ అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తుది రోజు ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో కూటమి శ్రేణులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

నాలో శ్వాస ఉన్నంత వరకూ నేను జనసైనికుడినే : డా చిట్ల కిరణ్



కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 24 : స్థానిక 53వ వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో డా చిట్ల కిరణ్ మాట్లాడుతూ తాను 53వ వార్డులో నామినేషన్ వేసిన తర్వాత కూటమి పార్టీల సీట్ల సర్దుబాటులో భాగంగా తన వార్డుని భారతీయ జనతా పార్టీకి కేటాయించడం వలన నేను ఆ పార్టీ అభ్యర్థి అయిన లక్ష్మి ప్రసన్నకి తన సంపూర్ణ మద్దతు ప్రకటించి, ఆవిడ మరియు కూటమి అభ్యర్థుల విజయానికి సహకరిస్తున్నానని, ప్రజలంతా మన కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నామినేషన్ ల ఉపసంహరణ రోజున తాను అత్యవసర శస్త్ర చికిత్సలో ఉండటం వలన తన నామినేషన్ ఉపసంహరణ చేయలేక పోయాను అని, అయినా తన సంపూర్ణ మద్దతు తెలుపుతూ కాకినాడ మేయర్ అభ్యర్థి ఆకుల భవానీ మరియు కూటమి అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని పత్రికా ముఖంగా తెలియజేస్తున్నానని అన్నారు. తన శ్వాస ఉన్నంత వరకూ తాను జనసైనికుడినేనని, జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సదా కృషి చేస్తానని డా చిట్ల కిరణ్ తెలిపారు.

రైతులు దళారుల బారిన పడి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

-మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి



కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్, 24: రైతులు దళారుల బారిన పడి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి పిలుపునిచ్చారు. మంగళవారం కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి మాట్లాడుతూ మండలంలో సుమారు 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చెయ్యడం జరిగిందని రైతులకు తెలియజేశారు. కావున రైతులందరూ దళారులు చేతిలో మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కామన్ వెరైటీ రకాలకు బస్తాకు 1830 రూపాయలు, గ్రేడ్ ఏ రకాలకు 1845 రూపాయలు ధరలను ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని రైతులకు తెలియజేశారు. దాళ్వాకు వేసుకోవాల్సిన వరి విత్తనాలు గురించి, ఎరువులు పంపిణీ చేయు విధానం గురించి రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు రమ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

గండేపల్లి మండలంలో ఎన్నికల సందడి..
39 మంది సర్పంచ్ అభ్యర్థులు

- 18 గ్రామ పంచాయతీల్లో 15 చోట్ల సర్పంచ్ పదవులకు పోటీ
- మూడు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవం
- 137 వార్డుల్లో 281 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు బరిలో
- 55 వార్డులు ఏకగ్రీవం

గండేపల్లి, పెన్ పవర్, నవంబర్ 24: గండేపల్లి మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఎన్నికల బరిలో నిలిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల వివరాలు వెల్లడయ్యాయి. మొత్తం 39 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉండగా, 137 వార్డుల్లో 281 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 15 పంచాయతీలకు సర్పంచ్ పదవుల కోసం పోటీ నెలకొంది. బొర్రాంపాలెం, జెడ్.రాగంపేట, ఎర్రంపాలెం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవమైనట్లు పట్టికలో పేర్కొన్నారు.వార్డు సభ్యుల విషయానికి వస్తే మొత్తం 137 వార్డుల్లో పోటీ ఉండగా, 281 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మరో 55 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. దీంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది.మండలంలోని గండేపల్లి, నీలాద్రిరావుపేట, కె.గోపాలపురం, మల్లేపల్లి, సుబ్బయ్యమ్మపేట, రామయ్యపాలెం, తాళ్లూరు, ఎల్లమిల్లి, ఎన్.టి.రాజాపురం, ఉప్పలపాడు, పి.నాయకంపల్లి, కె.నాయకంపల్లి, సింగరంపాలెం, సూరంపాలెం, మురారి తదితర గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు పోటీ నెలకొంది.ఏకగ్రీవమైన పంచాయతీలు, వార్డులు మినహా మిగిలిన స్థానాల్లో పోటీ రసవత్తరంగా మారడంతో అభ్యర్థులు ప్రచారానికి సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంటోంది.

నైట్ (సాయంత్రపు) కోర్టుల ఆలోచనను తక్షణమే విరమించుకోవాలి. - ప్రత్తిపాడులో న్యాయవాదుల విధుల బహిష్కరించి నిరసన



కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్, 24:కేంద్ర న్యాయ శాఖ ప్రతిపాదించిన నైట్ కోర్టుల(సాయంత్రపు కోర్టుల) ఏర్పాటు నిర్ణయన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు.ముందుగా ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి లంక గోపీనాథ్ 2 రోజులు పాటు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లుగా వినతి పత్రం అందచేసి న్యాయవాదులు కోర్టు ఆవరణలో నిరసన ప్రదర్శన చేసారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజాల చిట్టిబాబు ప్రధాన కార్యదర్శి బొంగుళూరి మధుబాబు లు మాట్లాడుతూ కేంద్ర న్యాయ శాఖ బార్ కౌన్సిల్, న్యాయవాద సంఘాలతో ఇతర భాగస్వాములతో ఎటువంటి ముందస్తు సంప్రదింపులు జరపకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నైట్ కోర్టు ప్రతిపాదన తీసుకురావడం సరికాదని, కక్షిదారులు,న్యాయవాదులకు ఉదయం 10-30 గం" నుండి సాయంత్రం 5 గంటల వరకూ సాగే సాధారణ కోర్టు కార్యకలాపాల తర్వాత, రాత్రిసమయాల్లో కోర్టులు నిర్వహించడం వల్ల న్యాయవాదులు, న్యాయమూర్తులు సిబ్బందితో పాటు దూరప్రాంతాలనుండి వచ్చే కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుందని రాత్రి వేళల్లో కోర్టులు నిర్వహించడం వల్ల మహిళా న్యాయవాదులు , మహిళా కక్షిదారుల ప్రయాణంతోపాటు భద్రతకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు, కనీస మౌలిక సదుపాయాలు, కోర్టులో కల్పించకుండా , భద్రతా ఏర్పాట్లు లేకుండా అదనపు సిబ్బంది లేకుండా సాయంత్రపు కోర్టులు నిర్వహించడం అసాధ్యం అని తెలియచేశారు. నైట్ కోర్టుల ఆలోచనను తక్షణమే విరమించుకుని అందుకు బదులుగా రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న న్యాయాధికారుల(జడ్జిల) పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, కోర్టులో మౌలిక వసతులను మెరుగు పరచాలని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ డిమాండ్ చేస్తుందన్నారు.ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్నీ ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజాల చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి బొంగుళూరి మధుబాబు , సీనియర్ న్యాయవాదులు గరిమెళ్ళ శివ సుబ్రమణ్యం, రమణశీ వీర వెంకట్రావు, ఆకాశపు కేశవ నాగ మల్లేశ్వరరావు, పలివెల నాగేంద్ర రాజు, రాయి అచ్యుత రామారావు, మాదాల మంజూష తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో హోరెత్తిన వైకాపా తుది రోజు ప్రచారం.

క్యారెట్ గుర్తుతో దూసుకుపోతున్న సర్పంచ్ అభ్యర్థిని దురియా పుష్పలత.



చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 24 . చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల తుది రోజు ప్రచారం మంగళవారం అట్టహాసంగా సాగింది. ఈ నెల 26న జరగనున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని దురియా పుష్పలత నిర్వహించిన భారీ ర్యాలీతో చింతపల్లి వీధులు వైకాపా శ్రేణుల నినాదాలతో హోరెత్తాయి. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆశీస్సులతో ఎన్నికల బరిలోకి దిగిన దురియా పుష్పలత, తనకు కేటాయించిన 'క్యారెట్' గుర్తుతో తనదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. తుది రోజు ప్రచారంలో భాగంగా ఆమె పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ప్రచారంలో ఆమెకు స్థానికుల నుంచి విశేష ప్రజాదరణ లభించడంతో పాటు, పెద్ద ఎత్తున ప్రజల ఆశీస్సులు దక్కాయి. స్థానిక నాయకులు, కార్యకర్తల కోలాహలం నడుమ సాగిన ఈ భారీ ర్యాలీలో వైకాపా గిరిజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, వైకాపా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు సాగిన గంగన్న పడాల్, మాజీ ఎంపీటీసీ చిందాడ జయలక్ష్మి పాల్గొని అభ్యర్థినికి మద్దతుగా ప్రచారం చేశారు. వీరితో పాటు వార్డు సభ్యుల అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తుది రోజు ప్రచారాన్ని విజయవంతం చేశారు.

నాగమణి గెలిస్తే జీకే వీధి అభివృద్ధికి మరింత అవకాశం

కూటమి సర్పంచ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 24:జీకే వీధి గ్రామపంచాయతీ కూటమి సర్పంచ్ అభ్యర్థి పసుపులేటి నాగమణికి మద్దతుగా తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మంగళవారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తూ స్థానికులను పలకరించి నాగమణికి మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున గ్రామపంచాయతీలోనూ కూటమి అభ్యర్థి విజయం సాధిస్తే అభివృద్ధి కార్యక్రమాలకు మరింత అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జీకే వీధి గ్రామపంచాయతీ అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు పసుపులేటి నాగమణి గెలుపు దోహదపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలలో వైసిపి మద్దతుదారులను గెలిపించండి.

అల్లూరి జిల్లా జడ్పీ చైర్పర్సన్ వంతల శాంతి.



చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 24. స్థానిక పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో వైసిపి మద్దతుదారులకు గెలిపించుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా జడ్పీ చైర్పర్సన్ వంతల శాంతి కోరారు. మంగళవారం ఆమె స్థానిక ఆదివాసీ ప్రభావిత పదం ప్రాంగణంలో జరిగిన వివాహానికి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన అనంతరం వైసిపి మద్దతుదారులతో కలిసి ఆమె ప్రచారంలో పాల్గొన్నారు. గత ఎన్నికలలో ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులకు మద్దతునిచ్చి విజయాన్ని అందించినట్లే సర్పంచ్ ఎన్నికలలో కూడా వైసిపి మద్దతు ఉన్న వారిని గెలిపించుకోవాలని ఆమె కోరారు.ం

రింతాడ సర్పంచ్ అభ్యర్థి పాతుని లక్ష్మణ్‌కు జడ్పీ చైర్‌పర్సన్ వంతల శాంతి మద్దతు



గూడెంకొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 24: మండలంలోని రింతాడ గ్రామపంచాయతీ వైఎస్సార్‌సీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పాతుని లక్ష్మణ్‌కు మద్దతుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వంతల శాంతి మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ పర్యటిస్తూ అభ్యర్థి లక్ష్మణ్‌కు మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ రింతాడ పంచాయతీ సమగ్ర అభివృద్ధికి జడ్పీ చైర్‌పర్సన్‌గా తన వంతు పూర్తి సహకారం అందిస్తానని గ్రామస్థులకు భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులు ఎన్నికైతే గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేసే అవకాశం ఉంటుందని పేర్కొంటూ పాతుని లక్ష్మణ్‌ను ఆశీర్వదించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో జీకే వీధి జడ్పీటీసీ కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీపీ పూజారి లీలా ప్రసాద్, మాజీ ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ గోదాములోని ఈవీఎం భద్రపరిచే కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, నవంబర్ 24:ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ఈవీఎంల భద్రత, భద్రపరిచే విధానాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం రాజమహేంద్రవరంలోని ఎఫ్‌సీఐ గోదాములో ఏర్పాటు చేసిన ఈవీఎం భద్రపరిచే గోదామును సాధారణ తనిఖీ నిర్వహించారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్‌తో కలిసి గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలను భద్రపరిచిన గది, అక్కడ కల్పించిన భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ కెమెరాల ద్వారా చేపడుతున్న నిరంతర పర్యవేక్షణ విధానాన్ని పరిశీలించారు. ఈవీఎం గోదాము పరిసరాల్లో భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరాయంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈవీఎంలను అత్యంత భద్రతతో భద్రపరచాలని, గోదాము భద్రతకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, సీసీటీవీ పర్యవేక్షణను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవీఎంల భద్రత, పారదర్శకతకు ఎన్నికల సంఘం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, నిబంధనల ప్రకారం గోదాము నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు.

వరదలకు ముందే బొదునూరు రహదారి పూర్తి చేయాలి...

రహదారి పనులను పరిశీలిం చిన జడ్పిటిసి పాయం



కూనవరం,పెన్ పవర్,నవంబ ర్24.మండల ప్రజలకు వరద ల సమయంలో ప్రత్యామ్నా య మార్గంగా ఉపయోగపడే బొదునూరు రహదారి పనులు నత్త నడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి సుమారు 2 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడంపై జడ్పీటీసీ పాయం వెంకయ్య తీవ్ర అసహనంవ్యక్తం చేశారు. గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని,రాబోయే వరదల కాలం నాటికైనా రహదారి పనులను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణంలోనాణ్యత పాటించాలని,లేనిపక్షంలోకఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు.ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణం వల్ల నష్టపోయిన రైతులతో జడ్పీటీసీ పాయం వెంకయ్య మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేసి పనులు వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కారందారయ్య, కారంసాగర్,కుంజా అప్పారా వు,కారం లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత, పారదర్శక గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- తొలి విడత ఎన్నికలకు ఐదు మండలాల్లో సర్వం సిద్ధం
- 88 పంచాయతీలు, 826 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- 1,559 పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ పూర్తి -- 41 సున్నిత ప్రాంతాల్లో మైక్రో అబ్జర్వర్లు



రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్, నవంబర్ 24 :పోలవరం జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. తొలి విడతలో ఐదు మండలాల పరిధిలో ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు.మంగళవారం విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ పునీత్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలోని కలెక్టర్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ కె. దినేష్ కుమార్, ఎస్పీ కె. చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్లను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అత్యంత భద్రతతో తరలించి భద్రపరచాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికల్లో తక్కువ ఓట్ల తేడాతో కూడా అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయమయ్యే అవకాశం ఉన్నందున పోస్టల్ బ్యాలెట్ల నిర్వహణలో ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్టీ రహిత ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతున్నందున బ్యాలెట్ పత్రాల పంపిణీ, పోలింగ్, సేకరణ, భద్రపరచడం వంటి ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని స్పష్టం చేశారు.

తొలి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో తొలి విడతలో అడ్డతీగల, దేవీపట్నం, గంగవరం, రాజమ్మంగి, రంపచోడవరం ఐదు మండలాల పరిధిలో 91 గ్రామ పంచాయతీలు, 850 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ఏకగ్రీవమైన స్థానాలను మినహాయించి 88 గ్రామ పంచాయతీల్లో 826 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఐదు మండలాల్లో సర్వీస్ ఓటర్లతో కలిపి 1,559 పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ ప్రక్రియ పూర్తయిందని, ఓటరు స్లిప్పుల పంపిణీని మంగళవారం సాయంత్రానికి పూర్తి చేస్తున్నట్లు వివరించారు.

రాజమ్మంగి మండలంలోని కొండపల్లి, అడ్డతీగల మండలంలోని వీరవరం, గంగవరం మండలంలోని జియ్యంపాలెం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. జగన్నాధపాలెంలో సర్పంచ్ స్థానం ఏకగ్రీవం కాగా, జిల్లావ్యాప్తంగా మొత్తం 116 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమైనట్లు వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ, వీడియోగ్రఫీ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని, 188 కేంద్రాల్లో సీసీటీవీ, మిగిలిన కేంద్రాల్లో వీడియోగ్రఫీ నిర్వహించనున్నట్లు తెలిపారు. 41 సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందికి నియామక ఉత్తర్వులు జారీ చేసి, ఎన్నికల సామగ్రిని సంబంధిత మండలాలకు తరలించామని వివరించారు.

రెండో విడతకు సన్నాహాలు

రెండో విడతలో గుర్తేడు, వై.రామవరం, చింతూరు, మారేడుమిల్లి, కూనవరం, వి.ఆర్.పురం, ఏటపాక ఏడు మండలాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సిబ్బందికి నియామక ఉత్తర్వులు అందజేశామని, బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయిందని పేర్కొన్నారు. నవంబర్ 27న పోస్టల్ బ్యాలెట్ సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెండో విడతలో 158 పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ, మిగిలిన కేంద్రాల్లో వీడియోగ్రఫీ ఏర్పాటు చేయడంతో పాటు 91 సున్నిత ప్రాంతాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు వెల్లడించారు.

జిల్లావ్యాప్తంగా 2,78,545 మంది ఓటర్లు

పోలవరం జిల్లా పరిధిలో రెండు విడతల్లో మొత్తం 12 మండలాల్లో 186 గ్రామ పంచాయతీలు, 1,734 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మొత్తం 2,78,545 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఇందుకోసం 1,911 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసినట్లు వివరించారు. తొలి విడతలో 1,35,562 మంది ఓటర్ల కోసం 924 బ్యాలెట్ బాక్సులు, రెండో విడతలో 1,42,983 మంది ఓటర్ల కోసం 987 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామన్నారు.

మారుమూల ప్రాంతాలు, మొబైల్ నెట్‌వర్క్ సదుపాయం తక్కువగా ఉన్న ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని 12 మండలాలకు ప్రత్యేక కమ్యూనికేషన్ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో 18 మంది నోడల్ అధికారులు, మండల స్థాయిలో 12 మంది నోడల్ అధికారులు, 40 మంది జోనల్ అధికారులు ఎన్నికల విధులను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట పోలీసు భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ కె. చక్రవర్తి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు.ఇదిలా ఉండగా, తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌కు 44 గంటల ముందుగానే ప్రచారం ముగించాల్సి ఉన్నందున మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచార గడువు ముగిసిందని కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ప్రచార గడువు ముగిసిన అనంతరం ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేసేలా పర్యవేక్షణ బృందాలు నిరంతరం నిఘా ఉంచుతాయని స్పష్టం చేశారు. అన్ని శాఖల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

301 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు



జీలుగుమిల్లి, పెన్ పవర్, నవంబర్ 24; మండలంలోని 12 పంచాయతీలకు గాను 301 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు అయినట్లు ఎంపీడీవో కే వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఆయా గ్రామపంచాయతీ రిటర్నింగ్ అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు హాజరై అర్హత కలిగిన దరఖాస్తులందరికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకుని సర్పంచి ,వార్డు బ్యాలెట్ పేపర్లను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. పంచాయతీల వారీగా అంకన్న గూడెం 28 ,దర్భ గూడెం 28, కామయ్యపాలెం 31, జీలుగుమిల్లి 44, ములగలంపల్లి 21, పి అంకంపాలెం 7, పి రాజవరం 7, రాచన్నగూడెం 22, తాటి యాకులగూడెం 36 ,టి గంగన్నగూడెం 22, స్వర్ణ వారి గూడెం 17, వంక వారి గూడెం 38, పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకున్నట్లు ఆమె తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



జీలుగుమిల్లి, పెన్ పవర్, నవంబర్ 24; పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ వి క్రాంతి కుమార్ సూచించారు. మంగళవారం పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను చేపట్టరాదని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సెల్ఫోన్లు కు అనుమతి లేదని అన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల లోపు పరిధిలో స్లిప్పులు పంచడం, ప్రచారం చేయడం కుదరని అన్నారు. ముందస్తు అనుమతి లేనిదే పోలింగ్ కేంద్రంలోనికి ప్రవేశం లేదని అన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని అన్నారు. ఎన్నికల సిబ్బందికి, పోలీసు వారికి సహకరించి పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఓటర్లను కోరారు.

పెద్దేవం గ్రామంలో అభివృద్ధి జరిగింది కాబట్టే వైసీపీకి ఓటు అడిగే ధైర్యం





- పార్టీ గౌరవాన్ని పెంచిన సర్పంచ్ అభ్యర్థి తోట రామకృష్ణ
- డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- జక్కంపూడి విజయలక్ష్మి

తాళ్లపూడి, పెన్ పవర్, నవంబర్ 24:మండలంలోని పెద్దేవం గ్రామంలో గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో పాలకవర్గమైన మాజీ సర్పంచ్ తిరిగిపల్లి వెంకట్రావు, మాజీ ఉపసర్పంచ్ తోటరామకృష్ణ గ్రామాన్ని ఆదర్శవంతమైన అభివృద్ధితో తీర్చిదిద్దారని, అభివృద్ధి చేశారు కాబట్టే ధైర్యంగా ఓటు అడిగే పరిస్థితి ఉందని రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి తోటరామకృష్ణను, వార్డు సభ్యుల అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మంగళవారం రోడ్ షో నిర్వహించి, ఓటర్లను అభ్యర్థించారు. గ్రామంలోని వివిధ వర్గాల ప్రజలను, రైతులను కలుసుకొని ఉన్నత స్థాయిలో అభివృద్ధి జరగాలంటే బుట్ట గుర్తుపై ఓటు వేసి తోట రామకృష్ణను, వారి బృందాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ ఉన్నత స్థాయి అభివృద్ధి చేసిన అనుభవం కలిగిన తోట రామకృష్ణ, వారి బృందాన్ని గెలిపిస్తే పెద్దేవం గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతారని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక దృష్టి పెట్టి తోట రామకృష్ణ పాలకవర్గం అడిగిందే తడువుగా నిధులు ఇచ్చారని, గ్రామంలో అభివృద్ధి చేశారని, జగనన్న కాలనీలు నిర్మించారని చెప్పారు. గ్రామం చిన్నదైనా జిల్లాస్థాయి అభివృద్ధి వైఎస్ఆర్ హయాంలో జరిగిందన్నారు. అత్యధిక మెజార్టీతో తోట రామకృష్ణను సర్పంచ్ గా, వారి బృందాన్ని గెలిపించాలని కోరారు.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలకు సీలు

ఎనిమిది మద్యం దుకాణాలు, ఒక బార్ మూసివేత



రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్ ,నవంబర్ 24:ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలవరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎనిమిది మద్యం దుకాణాలు, ఒక టీడీ-1 బార్‌కు మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఎక్సైజ్ అధికారులు సీలు వేశారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు రంపచోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు.రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, రాజమ్మంగి ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలతో పాటు ఒక బార్‌ను కూడా మూసివేసినట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ నెల 26వ తేదీ సాయంత్రం తిరిగి దుకాణాలను తెరవనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు భారీ పోలీస్ బందోబస్తు

- ఐదు మండలాలు, ఏడు పోలీస్ స్టేషన్ల పరిధిలో 310 మంది సిబ్బందితో భద్రత
- అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రత్యేక నిఘా -- జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి



రంపచోడవరం (పోలవరం జిల్లా బ్యూరో)పెన్ పవర్, నవంబర్ 24:పోలవరం జిల్లాలో నవంబర్ 26న నిర్వహించనున్న తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి తెలిపారు. ఐదు మండలాల పరిధిలోని ఏడు పోలీస్ స్టేషన్ల పరిధిలో సుమారు 310 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఎన్నికల భద్రతలో భాగంగా ఒక అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 10 మంది ఇన్‌స్పెక్టర్లు, 20 మంది ఎస్సైలతో పాటు ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ సిబ్బందిని విధులకు కేటాయించినట్లు తెలిపారు. టియర్ గ్యాస్ రిజర్వ్ బృందాలు, స్ట్రైకింగ్ ఫోర్స్, కూంబింగ్ బృందాలు, ఏఎన్ఎస్, గ్రేహౌండ్స్, సివిల్ పోలీస్, ఏఆర్, ఏపీఎస్పీ బలగాలను కూడా భద్రతా విధుల్లో మోహరించినట్లు పేర్కొన్నారు.సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర పోలీస్ పర్యవేక్షణ కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, ఓటర్లను భయపెట్టినా, ప్రలోభాలకు గురిచేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి విజ్ఞప్తి చేశారు.

నగర అభివృద్ధి పై కూటమి మేనిఫెస్టో

మేనిఫెస్టో విడుదల చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 24:చారిత్రక నగరం సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించామని మేనిఫెస్టోని నెరవేర్చు తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు. నగరంలో – 89 కోట్లతో హ్యావలాక్ బ్రిడ్జిని అభివృద్ధి చేస్తున్నామని , దేవాలయాల అభివృద్ధికి 100 కోట్లతో ప్రసాదం స్కీమ్ కింద నిధులు తెచ్చామని తెలిపారు. స్థానిక బిజెపి కార్యాలయంలో మంగళవారం ఆయన నగరపాలక ఎన్నికల సందర్భంగా కూటమి మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు, నగరంలో ట్రాఫిక్ నివారణకు పలు కీలక రోడ్లను విస్తరించి అభివృద్ధి చేస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి ని పూర్తి చేస్తామని ,విలీన గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కారమయ్యేలా చర్యలు, నమామి గంగే లాంటి గోదావరి కాలుష్యాన్ని నివారిస్తామ న్నారు. ఈనెల26న ఓటర్లు కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలన్నారు.అర్బన్ ఎమ్మెల్యేఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూగతంలో ఎన్నికలు జరగకుండా వైసీపీ ఉద్దేశపూర్వకంగా అడ్డుపడిందన్నారు. రెండు న్నరేళ్లలో నగరంలో 600కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.

జడేరు శివాలయం వద్ద ఘనంగా కోటి వత్తుల దీపోత్సవం

హిందూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి -- కుంజం వీర వెంకట సత్యనారాయణమ్మ

గంగవరం ,పెన్ పవర్ నవంబర్ 24:కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గంగవరం మండలంలోని జడేరు బ్రిడ్జి సమీపంలో ఉన్న శివాలయం వద్ద కోటి వత్తుల దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు, గంగవరం సర్పంచ్ కూటమి అభ్యర్థి కుంజం వీర వెంకట సత్యనారాయణమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, దీపారాధనలు నిర్వహించి భక్తులు భక్తిపారవశ్యంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా కుంజం వీర వెంకట సత్యనారాయణమ్మ మాట్లాడుతూ హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలు, పండుగల విశిష్టతను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటి పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్తీక మాసంలో దీపారాధనకు ఎంతో విశిష్టత ఉందని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఆమె కుటుంబ సభ్యులు, డాక్టర్ పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపోత్సవంలో తదితరులు పాల్గొని శివాలయంలో ప్రత్యేక పూజలు భాగస్వాములయ్యారు.

కట్టుదిట్టమైన భద్రత మధ్య కార్పొరేషన్, తొలి విడత పంచాయతీ ఎన్నికలు -- జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్



రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, నవంబర్ 24:ఈ నెల 26వ తేదీన జరగనున్న రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ(కార్పొరేషన్) ఎన్నికలతో పాటు, తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్న కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల పరిధిలో పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ సర్వసన్నద్ధమైందని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌లు, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్, ఫలితాల నేపథ్యంలో పాటించాల్సిన ప్రధాన నిబంధనలు

ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఐదుగురికి మించి గుమిగూడడం నిషేధమని, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, బహుమతులు పంపిణీ చేసినా, ఓటర్లను భయపెట్టినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారాలు చేస్తే సైబర్ క్రైమ్ ద్వారా కఠిన చర్యలు ఉంటాయని(గ్రూప్ అడ్మిన్‌లు కూడా బాధ్యులవుతారు) పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ముందస్తు అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, బాణాసంచా కాల్చడం, రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం పూర్తిగా నిషేధమని చెప్పారు. ఫలితాల అనంతరం ప్రత్యర్థులను రెచ్చగొట్టడం, దాడులు లేదా ప్రతీకార చర్యలకు పాల్పడకూడదని, ఫలితాలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధంగా ఎన్నికల అధికారులను సంప్రదించాలని తెలిపారు. ప్రజలంతా ఎలాంటి భయాందోళనలకు, ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రాంతాల్లో స్థానిక సెలవు ప్రకటించిన కలెక్టర్

పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజున నిర్దేశిత కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు



రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్ నవంబర్ 24:పోలవరం జిల్లాలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు--2026 రెండు విడతల్లో నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ జరిగే గ్రామ పంచాయతీల పరిధిలో స్థానిక సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ మంగళవారం తెలిపారు.జిల్లాలో తొలి విడత పోలింగ్ నవంబర్ 26న, రెండో విడత పోలింగ్ నవంబర్ 29న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొలి విడతకు సంబంధించి నవంబర్ 25, 26 తేదీల్లో, రెండో విడతకు సంబంధించి నవంబర్ 28, 29 తేదీల్లో ఆయా పోలింగ్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలుగా వినియోగించే భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలకు మాత్రమే స్థానిక సెలవు వర్తిస్తుందని స్పష్టం చేశారు. అయితే ట్రెజరీలు, సబ్ ట్రెజరీలు యథావిధిగా పనిచేస్తాయని తెలిపారు.అదేవిధంగా పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు పోలింగ్ రోజున స్థానిక సెలవు ప్రకటించినట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లోని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు కూడా నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం--1881 ప్రకారం పోలింగ్ రోజున సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలు, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు తమ ఉద్యోగులకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు కల్పించాలని కలెక్టర్ సూచించారు. సాధ్యం కాని సందర్భాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ సమయంలో కనీసం మూడు గంటల పాటు అవకాశం కల్పించాలని తెలిపారు. దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు కూడా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని స్పష్టం చేశారు.

అయితే ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బందికి, అత్యవసర సేవల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ సెలవులు వర్తించవని తెలిపారు. వారు సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు విధులకు హాజరు కావాలని సూచించారు.ఈ ఉత్తర్వులు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, ఇతర సంస్థల్లో అమలయ్యేలా జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, కార్మిక శాఖ ఉప, సహాయ కమిషనర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు కలెక్టర్ వెల్లడించారు.పోలింగ్ జరిగే గ్రామ పంచాయతీలు, వార్డుల పరిధిలో మాత్రమే ఈ సెలవులు వర్తిస్తాయని, ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీలు, వార్డులు, పోలింగ్ జరగని ప్రాంతాలకు ఈ ఉత్తర్వులు వర్తించవని కలెక్టర్ స్పష్టం చేశారు.

సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలి



అదనపు ఎన్నికల అధికారి, కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం , పెన్ పవర్ నవంబర్ 24:పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాల వద్ద సిబ్బందికి అసౌకర్యం కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అదనపు ఎన్నికల అధికారి, కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. మంగళవారం ఎస్ కే వి టి కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఏర్పాట్లు స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా చూడాలని త్రాగునీరు, భోజనం, విద్యుత్, షామియానాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. బ్యాలెట్ పత్రాల భద్రత విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాట్లు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఈఈలు మదర్సా అలీ, మాధవి, డీఈలు లోవరాజు, విరూపాక్ష, ఏఈలు సత్యనారాయణ, రమేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ లో వినియోగించుకున్న 945 ఉద్యోగులు...

నగరపాలక ఎన్నికలకు సంబంధించి 945 మంది ఉద్యోగులు కేంద్రంలో 23, 24 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ లో ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అదనపు ఎన్నికల అధికారి, కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఆర్యాపురంలోని శ్రీ నన్నయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఓటింగ్ కు సంబంధించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు హెల్ప్‌డెస్క్ ద్వారా పూర్తి సహకారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ కవర్లు, డిక్లరేషన్ ఫారాల్లో నమోదు చేయాల్సిన వివరాలపై ఓటర్లకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నచిన్న పొరపాట్ల కారణంగా ఓట్లు చెల్లకుండా పోయే పరిస్థితి రాకూడదని తేల్చి చెప్పారు. సరైన అవగాహన కల్పించడం ద్వారా ఓటర్ల సమయం ఆదా కావడంతోపాటు, వారు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్ లను నిబంధనల ప్రకారం పక్కాగా సీలింగ్ చేసి, స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచాలన్నారు. 23 వ తేదీన 265 మంది ఉద్యోగులు, 24 న 680 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు

PROFORMA – IV (a) Report on List of Contesting Candidates for Sarpanch

(To be sent on 24.11.2026)

Sl. No.	District	Revenue Division	Mandal	Name of the GP	No. of Sarpanchas notified for election	No. of Sarpanchas declared Uncontested (Unanimous)	Balance No. of Sarpanchas going to Poll (5-6=7)	No. of Contesting Candidates
1	2	3	4		5	6	7	8
1	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	Dalipadu	1	0	1	6
2	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	P. Yerragonda	1	0	1	5
3	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	Yerramreddipalem	1	0	1	5
4	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	K. Yerragonda	1	0	1	4
5	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	Yarlagadda	1	0	1	5
6	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	Chamagadda	1	0	1	3
7	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	Chavitidibbalu	1	0	1	6
8	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	Panasalapalem	1	0	1	5
9	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	Devaramdugula	1	0	1	2
10	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	Kota	1	0	1	3
11	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	Chinthalapudi	1	0	1	3
12	Polavaram	Rampachodavaram	Y.Ramavaram	Y.Ramavaram	1	0	1	5
		TOTAL			12	0	12	52

Mandal Parishad Dev. Officer
Mandal Praja Parishad
Y.Ramavaram(M), Polavaram Dist.,

వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 24: మండలంలో 52 మంది సర్పంచ్ అభ్యర్థులు, 177 మంది వార్డు మెంబర్లు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో మిగిలారని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

మండలంలో చామగడ్డ పంచాయతీ లో ముగ్గురు అభ్యర్థులు, చవితి దెబ్బలు పంచాయతీలో ఆరుగురు, చింతలపూడిలో ముగ్గురు, దాలిపాడు పంచాయతీలో ఆరుగురు, దేవరమడుగులో పంచాయతీలో ఇద్దరు, కె ఎర్రగొండ పంచాయతీలో నలుగురు, కోటలో ముగ్గురు, పి ఎర్రగొండలో ఐదు మంది, పనసల పాలెం లో ఐదు, యార్లగడ్డలో ఐదు, వై రామవరం లో ఐదుగురు, ఎర్రం రెడ్డిపాలెం లో ఐదుగురు సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. మంగళవారం 28 మంది వార్డు సభ్యులు నామినేషన్ల ఉపసంహరించుకోగా 74 వార్డులకు 177 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారిఅధికార దుర్వినియోగం పై హైకోర్టు లో కేసు

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడ శ్రీనివాస్ విమర్శ



రాజమహేంద్రవరం, పెన్ పవర్,నవంబర్ 24 :మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో రిటర్నింగ్ అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డరని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడ శ్రీనివాస్ ఆరోపించారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ విమర్శించారు.మంగళవారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన తమ మేయర్ అభ్యర్థి బోడపాటి నిర్మల, కార్పొరేట్ అభ్యర్థులు ఏ-ఫామ్ ల ను కలెక్టర్ కార్యాలయంకు అందచేసాము . బి ఫామ్ ను ఆర్ ఓ కు సమర్పించినట్లు తెలిపారు. తాము సమర్పించిన ఏ-ఫామ్ కు సంబంధించి ఏ విధమైన రసీదు ఇవ్వలేదని వివరించారు.ఈనెల 17వ తేదీన తాము సబ్మిట్ చేసిన ఏ - ఫామ్ లకు సంబంధించి రిజిస్టర్ పోస్టు ద్వారా కలెక్టర్ కార్యాలయానికి మరోసారి పంపించినట్లు తెలిపారు. ఈనెల 17వ తేదీన ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కలిసి మేయర్ అభ్యర్థికి ఐడి కార్డ్ ఇవ్వాలని కోరితే ఐడి కార్డు పై కార్పొరేటర్ అభ్యర్థి అని కానీ, మేయర్ అభ్యర్థి అని కానీ వివరాలు లేకుండా ఐడి కార్డ్ ఇచ్చారని అన్నారు. తమ పార్టీ సభ్యులు పట్టుబడితే మేయర్ అభ్యర్థి అని డిక్లర్ చేస్తూ ఐడి కార్డు ఇచ్చారని తెలిపారు. 18వ తేదీన సబ్మిట్ చేసిన బి ఫారం తాలూకు పత్రాలు తమ వద్ద లేవని రిటర్నింగ్ అధికారి కనకారావు అబద్దాలు చెప్పారన్నారు. . బి ఫాం దాఖలు చేసే సమయంలో సీసీ కెమెరాలు ఉంటాయని వాటిని అధికారులు పరిశీలిం చాలన్నారు. తమ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్ అభ్యర్థిగా బోడపాటి నిర్మల, కార్పొరేటర్లుగా జాఫర్ అబ్బాస్, జవ్వాది దుర్గా శ్రీ వల్లి, సింహ దుర్గారావు, నాగూర్ అన్నపూర్ణాలు పోటీ చేస్తున్నారని తెలిపారు. 2004, నుంచి 2024 వరకు జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ఇలాంటి మోసాలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే ప్రజాస్వామ్యం ఖూనీ అయినట్లేనని అన్నారు. కూటమి ప్రభుత్వం తో కుమ్మక్కైన ఎన్నికల అధికారి కనకారావు కార్పొరేషన్ లో ఓటు లేని అభ్యర్థికి 72 వ వార్డు కార్పొరేటర్ గా పోటీ చేసేందుకు అనుమతి ఇచ్చారన్నారు. ఎన్నికల అధికారి పాల్పడుతున్న మోసాలను కోర్టు దృష్టికి తీసుకువెళ్లి అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోసాలతో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతున్నాయని ఆరోపించారు.పుష్కరాల సొమ్మును దోచుకునేందుకే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పుష్కర నిధులు భారీగా వస్తాయని కార్పొరేటర్ లను నమ్మబలికి ఒక్కొక్క కార్పొరేటర్ అభ్యర్థి నుంచి రూ 1 కోటి రూపాయల వరకు వసూలు చేశారని ఆరోపించారు. గత 29 సంవత్సరాలుగా పార్టీ అభ్యర్థులు ప్రజా సమస్యల పై పోరాడి పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్పొరేషన్ ఎన్నికలలో పోటీ చేస్తున్న రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని పిలుపు ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వస్తే కాలుష్యం లేని గోదావరి నది జలాలను ప్రజలకు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పెండ్యాల కామరాజు, డి.వి. రమణమూర్తి,లంక దుర్గా ప్రసాద్, ఎండి హుస్సేన్, దుడ్డే సురేష్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, కొల్లి సత్యనారాయణ , బోడపాటి నిర్మల , సర్కిల్ జాఫరీ అబ్బాస్ , సిమ్మా దుర్గారావు , నాగూరి అన్నపూర్ణ , మాసా సుభద్ర, నాగూర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు .

ఆదిత్యలో భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు



గండేపల్లి, పెన్ పవర్, నవంబర్ 24:గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ క్యాంపస్ లో గల ఆదిత్య ఆధ్యాత్మిక ప్రాంగణంలో సాంస్కృతిక కళా వేదిక వద్ద కార్తీకమాసం పర్వదినం సందర్భంగా ఆదిత్య అధినేత డా.నల్లమిల్లి శేషారెడ్డి శ్రీమతి లక్ష్మీరాజ్యం దంపతులచే తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన లింగానికి రుద్రాభిషేకాలు,బిల్వ పత్ర అర్చన,నిర్వహించారు,సాయి నాధుని కి ప్రత్యేక అభిషేకాలు,నీరాజన మంత్రం పుష్పాలతో కార్యక్రమం ఆద్యంతం ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేషారెడ్డి దంపతులతో పాటు కుటుంబసభ్యులు బంధుమిత్రులు, సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు సైతం ప్రత్యక్షంగా అభిషేక కార్యక్రమంలో పాల్గొని ఎంతో భక్తి పారవశ్యంతో మధురానుభూతిని పొందారు. పూజ అనంతరం భక్తులందరికీ ప్రసాద వితరణ జరిగింది.

బలభద్రపురం జటాద్రి కొండపై శివాలయానికి శంకుస్థాపన



జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 24: మండలంలో బలబద్రపురం జటాద్రి కొండపై కొలువై ఉన్న శ్రీ భూదేవి సమేత జటాద్రి బలబద్రేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం మంగళవారం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివగణేష్ ఆధ్వర్యంలో మహా కార్తీక పౌర్ణమి పర్వదినాన్న అట్టహాసంగా భక్తిశ్రద్ధలతో జటాద్రి కొండపై నిర్వహించారు. మరోతి శివగణేష్ మాట్లాడుతూ 120 ఎకరాల విస్తీర్ణం గల జటాద్రి కొండ మహాపర్వతాన్ని దైవ క్షేత్రంగా తీర్చిదిద్దడానికి కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకొని ఉందన్నారు. ఇప్పటివరకు 15 నుండి 20 ఎకరాల లోపు డి ఫారం పట్టాలు పొందిన వారు మరియు ఎంక్రోచ్మెంట్ సాగు చేస్తున్న లబ్ధిదారులు భయపడవలసిన అవసరం లేదని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వచ్చిన తర్వాత ఆయా డిఫారం రైతులు మరియు ఆక్రమణదారులకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం చెల్లించే కార్యక్రమం తీసుకుంటామని శివ గణేష్ భరోసానిచ్చారు. అదేవిధంగా రాజకీయ అండదండలతో కానీ, ఆర్థిక మరియు అర్థ బలంతో గాని పుణ్యక్షేత్రమైన జటాద్రి పర్వతంపై ఏ విధమైన చొరబాటు, ఆక్రమణ కార్యక్రమాలు నిర్వహిస్తే తరిమి తరిమి కొడతామని శివ గణేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కట్టమూరి రామకృష్ణ, యర్రా పరమేశ్వర రావు, ముమ్మన శ్రీనివాస రావు, సీదిరి మరిదియ్య, తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించండి



- **గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా**
- **జడ్పీ వైస్ చైర్మన్ డాక్టర్ తీగల ప్రభ**

గంగవరం, పెన్ పవర్, నవంబర్ 24: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ డాక్టర్ తీగల ప్రభ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గంలోని అడ్డతీగల, దేవీపట్నం, గంగవరం మండలాల్లోని పలు గ్రామాల్లో ఆమె విస్తృతంగా పర్యటించి కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.అడ్డతీగల మండలంలోని రాయిపల్లి, దుచర్తి, ఊట్లపాలెం, అనుకులపాలెం గ్రామాల్లో పర్యటించి సర్పంచ్ అభ్యర్థుల విజయానికి ప్రజల మద్దతు కోరారు. అదేవిధంగా దేవీపట్నం మండలంలోని ఇందుకూరు, ఇందుకూరుపేట, చరభవరం, దేవారం, చిన్నారిగండి, ఫజిల్లాబాద్ తదితర గ్రామాల్లో పర్యటించి కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గంగవరం మండలంలోని మొల్లేరు, ఎండపల్లి, రామవరం, గంగవరం గ్రామాల్లోనూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ తీగల ప్రభ మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాలోని పలు గ్రామాల్లో తాగునీరు, రహదారులు, మురుగునీటి పారుదల వంటి మౌలిక సమస్యలు ఉన్నాయని తెలిపారు. గ్రామాల పర్యటనలో ప్రజలు తన దృష్టికి తీసుకువస్తున్న సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ ప్రచార కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షుడు పాము అర్జున్, సర్పంచ్ అభ్యర్థి బొజ్జపు శాంతిలత, తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికల ప్రచారాల మైకుల హోరుకు తెర



వార్డుల్లో గుమ్మనంగా సాగిన నగదు పంపకాలు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 24:ఈనెల 26న జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా నగరంలో గత వారం రోజులుగా అభ్యర్థుల అభ్యర్థుల ప్రచార మైకుల హోరుకు మంగళవారం సాయంత్రం తో తెరపడింది. సుమారు 7 సంవత్సరాల అనంతరం జరుగుతున్న కార్పొరేషన్ ఎన్నికలకు మేయర్ అభ్యర్థికి 13 మంది పోటీ పడుతుండగా, 72 వార్డులకు కార్పొరేటర్లు గా 234 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వారం రోజులుగా అభ్యర్థుల ప్రచారం హోరు తో నగర ప్రజల చెవులకు చిల్లులు పడ్డాయి. కూటమి పార్టీలు ప్రచారాన్ని గట్టిగా చేయగా వైసిపి పార్టీ ప్రచారాన్ని నామమాత్రంగా చేయగా, మిగతా పార్టీలు స్వతంత్రులు అంతంత మాత్రమే సాగించడం గమనార్హం. మంగళవారం సాయంత్రానికి నగరం ప్రశాంత వాతా వరణం నెలకొంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు వారి వారి వార్డుల్లో నగదు పంపకాలకు తెర లేపారు. సోమవారం రాత్రి నుంచి ఈ ప్రక్రియ ఆయా వార్డుల్లో గుమ్మనంగా సాగిస్తున్నట్లు వినిపిస్తోంది. ఓటర్ స్లిప్పులను బట్టి 1000 రూపాయల నుంచి 1500 రూపాయల వరకు ముట్ట చెబుతున్నట్లు తెలుస్తోంది. పంపిణీ సక్రమంగా జరగని, అందని కొన్ని ప్రాంతాల్లో మహిళలు ఆయా పార్టీల నాయకులను నిలదీస్తున్నట్లు తెలుస్తోంది. సండేట్లో సండే మీయలాగా చాలా వార్డుల్లో ఆయా పార్టీల నాయకులు కుమ్మక్కయి పంపిణీలో కోత లు పెడుతూ పెడుతూ అయిన కాడికి అందెన కాడికి వెనకేసుకుంటు న్నారని వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా ప్రచారం చివరి రోజు మంగళవారం కూటమి పార్టీలు, వైసీపీ, కాంగ్రెస్ పార్టీ ల మేయరు, కార్పొరేటర్లు అభ్యర్థులు అనుచరులు, కార్యకర్తలు, నాయకులతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి ప్రచారాన్ని ముగించారు.

కార్తీక పౌర్ణమి వేడుకల్లో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం





గోవిందగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో అఖండ దీపారాధన

రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్ నవంబర్ 24:కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోవిందగిరి, (ఐ. పోలవరం) శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం కార్తీక దీపోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తజనుల గోవింద నామస్మరణలు, దీపకాంతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పార్థ స్వామి, మణికంఠ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ముందుగా అర్చక స్వాములు, ఆలయ అధికారి అంచూరి శిరీష దంపతులు కలిసి కార్తీక అఖండ దీపాన్ని వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణమంతా కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు.వేడుకలో భాగంగా అర్చకులు భక్తులకు శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య గుణగణాలను, కార్తీక పౌర్ణమి పర్వదినం యొక్క విశిష్టతను వివరించారు. కార్తీక పౌర్ణమి వంటి పవిత్రమైన రోజున భగవంతుని సన్నిధిలో దీపం వెలిగించడం వల్ల ఏడాది పొడవునా దీపారాధన చేసినంతటి పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు. దీపదానం చేయడం ద్వారా భగవంతుని కృపాకటాక్షాలు పొంది, సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు.ఆలయ అధికారి అంచూరి శిరీష పర్యవేక్షణలో కార్యక్రమం భక్తిప్రపత్తులతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ దీపోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

ర్యాలిలో పంచాయతీ ఎన్నికల వేడి

- **16 వార్డులకు 31 మంది అభ్యర్థులు.. సర్పంచ్ బరిలో ముగ్గురు**
- **77 నామినేషన్లలో 46 ఉపసంహరణ.. అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయింపు**



ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 24:ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామ పంచాయతీలో పంచాయతీ ఎన్నికల సమరం మరింత ఆసక్తికరంగా మారింది. నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య స్పష్టమైంది. గ్రామంలోని 16 వార్డు స్థానాలకు మొత్తం 77 నామినేషన్లు దాఖలు కాగా, ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి 46 నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో మిగిలిన 31 మంది అభ్యర్థులు 16 వార్డు స్థానాల కోసం ఎన్నికల బరిలో నిలిచారు. సర్పంచ్ పదవికి ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉండటంతో గ్రామ రాజకీయ వాతావరణం ఆసక్తికరంగా మారింది.ముఖ్యంగా సర్పంచ్ అభ్యర్థులలో బీఎస్పీ పార్టీ తరఫున కూడా ఒక అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడం గ్రామంలో రాజకీయ చర్చకు దారితీసింది. వివిధ వర్గాల నుంచి అభ్యర్థులు పోటీలో నిలవడంతో రాబోయే ఎన్నికల్లో ఓటర్ల తీర్పు ఎలా ఉండబోతుందన్న ఆసక్తి గ్రామ ప్రజల్లో నెలకొంది.మంగళవారం మధ్యాహ్నం 2.40 గంటలకు ఎన్నికల అధికారులు పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించారు. సర్పంచ్ అభ్యర్థులకు కత్తెర, మంచం, ఉంగరం గుర్తులు కేటాయించగా, వార్డు సభ్యుల అభ్యర్థులకు గౌను, రాగితో పాటు ఎక్కువ శాతం కుక్కర్ గుర్తులు కేటాయించినట్లు తెలిసింది. గుర్తుల కేటాయింపు పూర్తికావడంతో అభ్యర్థులు తమ తమ ఎన్నికల గుర్తులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రచారానికి సన్నద్ధమవుతున్నారు.ఇప్పటివరకు నామినేషన్ల ప్రక్రియతో సాగిన ఎన్నికల సందడి ఇక ప్రచార పర్వంలోకి అడుగుపెట్టనుంది. ప్రతి వార్డులోనూ ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు ప్రారంభించనున్నారు. గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం వంటి అంశాలు ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి. శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎస్. నాగమల్లి సమక్షంలో నామినేషన్ల ఉపసంహరణ, ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తవడంతో ర్యాలి గ్రామంలో పంచాయతీ ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది. అభ్యర్థుల ప్రచారం, ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నాలతో రాబోయే రోజుల్లో గ్రామంలో ఎన్నికల సందడి మరింత పెరగనుంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com